మాయకు వశమైనవాడి లక్షణాలు

రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మాయకు వశమైనవాడి లక్షణాలు

రచన : బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : సెప్టెంబరు, 2026

ప్రతులు : 1,000

వెల : రూ. 60/-

పుస్తకముల కొరకు :-

తటవర్తి వీరరాఘవరావు,

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

1) మరోజన్మ	-	రూ.160/-
2) సాధనలో స్థితులు	-	రూ.80/-
3) జ్ఞానమాల	-	రూ.70/-
4) దత్తాత్రేయుని 24 మంది గురువులు	-	రూ.70/-
5) బుద్ధుని సూక్తులు	-	రూ.70/-
6) జీవిత పరమార్థం	-	రూ.70/-
7) అవిద్య అంటే?	-	రూ.70/-
8) బుద్ధుని పంచశీలాలు	-	రూ.70/-
9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం?	-	రూ.70/-
10) ఆత్మ పరిణామక్రమం	-	రూ.70/-
11) "అహం దేహాస్మి" నుంచి "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి ఎదగాలి	-	రూ.70/-
12) మనసుకు వున్న మూడు దోషాలు	-	రూ.60/-
13) గురుపౌర్ణమి విశిష్ఠత	-	రూ.60/-
14) మానవుడు యోగిగా ఎదగాలంటే?	-	రూ.60/-
15) ఏది సరైన సాధన?	-	రూ.60/-
16) పంచకోశాలు	-	రూ.60/-
17) మనస్సు యొక్క స్థితులు	-	రూ.60/-
18) ధార్మిక జీవితం అంటే?	-	రూ.60/-
19) జీవితం ధన్యం చేసుకోవాలంటే?	-	రూ.60/-
20) జన్మరాహిత్య స్థితికి మార్గం	-	రూ.60/-
21) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు	-	రూ.60/-
22) మాయకు వశమైనవాడి లక్షణాలు	-	రూ.60/-
23) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి?	-	రూ.60/-
24) మానవుని కర్తవ్యాలు	-	రూ.50/-
25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి?	-	రూ.50/-
26) చిత్తం శాంతిగా వుండాలంటే?	-	రూ.50/-
27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు	-	రూ.50/-
28) బాహ్య మౌనం - అంతర్ మౌనం	-	రూ.50/-
29) అహంకారం ఎలా పోతుంది	-	రూ.50/-
30) మానవుల్లో అసంతృప్తికి కారణం	-	రూ.50/-
31) ప్రీతి,భీతి, నీతి	-	రూ.40/-
32) జీవితంలో విజయం సాధించాలంటే?	-	రూ.40/-

మాయకు వశమైన వాడి లక్షణాలు

సాధన చేసే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా ఎదగాలని అనుకున్నప్పుడు, ఈ మాయే అతి పెద్ద శత్రువుగా మారుతుంది. పరమాత్మ వైపు ప్రయాణిస్తున్న ఈ ఆధ్యాత్మిక మార్గంలో, మాయకు వశమైన వారు మళ్ళీ మళ్ళీ ప్రపంచం వైపు తిరిగిపోతూ ఉంటారు. పరమాత్మ మొట్ట మొదటిసారిగా శబ్ద రూపంలో బ్రహ్మదేవుడికి జ్ఞానం బోధిస్తున్నప్పుడు ఏమని చెప్తాడంటే, "నేను సృష్టించిన మాయ, నన్ను చేరనివ్వకుండా ప్రతి క్షణం అడ్డుపడుతూ ఉంటుంది, కానీ నన్ను చేరుకోవాలని అనుకున్నవాడు ఈ మాయను దాటాలి, ఆ మాయను దాటడానికి ధ్యానసాధనే ఏకైక మార్గం, ధ్యానం ద్వారా మాత్రమే మాయను తొలగించుకుని నన్ను చేరుకోగలడు" అని భాగవతంలో చెప్పడం జరిగింది.

అందుకే మీరు ఎంత ఎక్కువగా సాధన చేస్తారో, అంతగా మాయను జయించగలుగుతారు. సాధన పెరిగే కొద్దీ మాయ ప్రభావం తగ్గుతుంది, మాయ ప్రభావం తగ్గే కొద్దీ మీ మనసు ప్రపంచం వైపు కాకుండా పరమాత్మ వైపు తిరుగుతుంది.

కానీ ఆ సాధనను ప్రారంభించినప్పుడు, ఒక సద్గురువు ద్వారా దుఃఖాన్ని నివారించే మార్గం సాధన అని తెలుసుకుంటాడు. అయితే సాధన మార్గంలో అడుగుపెట్టిన వెంటనే అన్నీ సులభంగా జరిగిపోవు, ఆ సాధనలో అడుగడుగునా మానవుడికి ఎన్నో పరీక్షలు ఎదురవుతూనే ఉంటాయి.

ఈ పరీక్షలు ప్రకృతి కల్పించిన మాయే! మాయకు వశమైనప్పుడు మానవుడు ఎలా ఆలోచిస్తాడు? ఎలా ప్రవర్తిస్తాడు? ఎలాంటి విషయాల పట్ల ఆకర్షితుడవుతాడు? సాధన చేస్తున్నప్పటికీ మాయ ఎలా అతన్ని మళ్ళీ ప్రపంచం వైపు లాగుతుంది? ఇవన్నీ తెలుసుకుందాం.

1) ప్రపంచమే శాశ్వతం అనుకోవడం:

మాయకు వశమైన వాడు ప్రపంచమే శాశ్వతం అని అనుకుంటాడు. జీవుడు పుట్టిన దగ్గర నుంచి ఈ ప్రపంచాన్నే చూస్తూ ఉంటాడు. కళ్ళకు కనిపించేది మాత్రమే నిజం అనుకుంటూ, “ఇదే శాశ్వతం” అనే భావంలో జీవిస్తూ ఉంటాడు. అందుకే “జగత్ మిథ్య, ఆత్మ సత్యం” అని చెప్పినప్పుడు కొంత మందికి వెంటనే నమ్మకం కలగదు. ఎందుకంటే వారి దృష్టిలో ఇంతకాలం కనిపిస్తున్న ఈ ప్రపంచమే సత్యం అనుకుంటారు. అందుకే దీనికి మరింత వివరణ కావాలి. “ఒకప్పుడు ఉండి, ఒకప్పుడు లేనిది మిథ్య” అని మళ్ళీ మళ్ళీ బోధించినప్పుడు, ఆ మాట యొక్క అర్థం కొంతవరకు అర్థమవుతుంది. ఈ అవగాహన కలిగే వరకు మనిషి జగత్తే సత్యం అని అనుకుంటూ ఉంటాడు.

అలా ప్రపంచమే శాశ్వతం అనే భావంలో ఉన్నప్పుడు, అతను ప్రపంచపు భ్రాంతుల్లో మునిగిపోతాడు. ప్రపంచంలో లభించే భోగాల పట్ల ఆకర్షితుడవుతాడు, ఇంద్రియాలకు ఆనందాన్ని కలిగించే విషయాలనే నిజమైన సుఖంగా భావిస్తాడు. ప్రపంచం శాశ్వతం అనే భావన ఎంత బలపడుతుందో, దాని పట్ల ఆకర్షణ కూడా అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది, ఇదే మాయ ప్రభావం. శాశ్వతమైన ఆత్మను మరిచిపోయి, అశాశ్వతమైన ప్రపంచాన్ని శాశ్వతంగా భావించేలా చేయడమే మాయా ప్రభావం. అందుకే సాధకుడు ఎప్పటికప్పుడు తనను తాను విచారించుకోవాలి “నేను దేనిని శాశ్వతం అనుకుంటున్నాను? నా దృష్టి ఎటు ఉంది? నా ఆకర్షణ ప్రపంచం వైపా, పరమాత్మ వైపా?” అని.

2) శరీరమే నేను అనుకోవడం:

మాయకు వశమైన వాడు శరీరమే శాశ్వతం అని అనుకుంటాడు. "శరీరమే నేను" అనే భావంతో జీవిస్తూ ఉంటాడు. ఈ భావం కూడా మాయే. ఎందుకంటే గురువు సాధన చేసే వారికి, "మీరు శరీరం కాదు, మీరు ఆత్మ" అని స్పష్టంగా బోధిస్తాడు. అయినప్పటికీ శరీరం పట్ల ఉన్న ఆకర్షణ, ఇంద్రియ భోగాల పట్ల ఉన్న ఆకర్షణ తగ్గదు. ఎప్పుడైతే "నేను ఈ శరీరమే" అనే భావం వచ్చిందో, అప్పుడు ఇంద్రియాలకు ఏది కావాలంటే అది అందించడానికి మనిషి ప్రయత్నిస్తూ ఉంటాడు. ఇంద్రియాలు కోరిన ప్రతి విషయాన్ని అనుభవించాలనే తపన పెరుగుతుంది, దాంతో ఇంద్రియ భోగాల పట్ల ఆకర్షణ క్రమంగా మరింత ఎక్కువవుతూ ఉంటుంది.

ఇంద్రియ భోగాలు అంటే ఏ విషయాలు మీకు ఆనందాన్ని ఇస్తాయని మీరు అనుకుంటారో, వాటి పట్ల కలిగే ఆకర్షణనే ఇంద్రియ భోగాల పట్ల ఆకర్షణగా చెప్పవచ్చు. ఇంద్రియాలకు కలిగే సంతోషాన్నే ఆనందంగా భావించడం మాయ ప్రభావం.

చూడండి, కొంత మందికి కళ్ళ ద్వారా చూసే విషయాల్లోనే చాలా ఆనందం ఉందని అనిపిస్తుంది. కళ్ళకు కనిపించే అందమైన దృశ్యాలు, వస్తువులు, ప్రదేశాలు చూస్తూ ఆనందాన్ని పొందుతారు. అలా తమకు కనిపించేదే ఆనందానికి కారణమని భావిస్తారు.

మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనిస్తే, కళ్ళ ద్వారానే ప్రపంచం ఎలా ఉంది అనే భావం మీరు ఏర్పరచుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి ఇంద్రియానికి ఏ విషయం సంతోషాన్ని కలిగిస్తుందో, ఆ విషయంపైనే ఆకర్షణ పెంచుకుంటూ ఉంటారు. కానీ గురువు ఎంత చెప్పినా, ఆ ఆకర్షణను

తగ్గించుకోకుండా ఉండేలా చేసేది మాయే. ఇంద్రియ నిగ్రహం లేకుండా చేస్తుంది కూడా మాయే. నాలుకకు నచ్చే రుచులు కావచ్చు, చెవులకు వినిపించే శబ్దాలు కావచ్చు, కళ్ళకు కనిపించే దృశ్యాలు కావచ్చు ఇలా ప్రతి ఇంద్రియం తనకు నచ్చిన విషయాల వైపు ఆకర్షితమవుతూనే ఉంటుంది.

గురువు "ఇంద్రియ నిగ్రహం అవసరం, ధ్యానం చేయాలి, సాధన చేయాలి" అని ఎంత చెప్పినా, మాయకు వశమైన మనసు వాటిని పూర్తిగా ఆచరించనివ్వదు. అంతేకాదు, సాధనను కూడా తన కోరికల కోసం, తన లాభాల కోసం ఉపయోగించుకోవాలని చూస్తుంది. ధ్యానం ద్వారా ఆధ్యాత్మికంగా ఎదగడం కంటే, ధ్యానం వల్ల ఏదైనా ప్రాపంచిక లాభం వస్తుందా? అని ఆలోచిస్తూ ఉంటుంది. ఎప్పుడైతే ధ్యానం కంటే ఇంద్రియ భోగాల పట్ల, ప్రపంచం పట్ల ఆకర్షణ ఎక్కువవుతుందో, అప్పుడే ధ్యానం పట్ల అశ్రద్ధ మొదలవుతుంది. ఏదో అరగంటో, గంటో ధ్యానం చేసి, "మేము కూడా సాధన చేస్తున్నాము" అని అనుకుంటూ ఉంటారు, కానీ ఆ సాధనను కూడా మనస్ఫూర్తిగా చేయరు.

అసలు ఎందుకు మనస్ఫూర్తిగా సాధన చేయలేకపోతున్నారు? మాయకు వశమై ఇంద్రియ విషయాల పట్ల ఆసక్తిని పెంచుకుంటున్నారు కాబట్టే. మనసు ఎప్పుడూ ఇంద్రియాల వైపు, ప్రపంచం వైపు పరుగెడుతూ ఉంటే ధ్యానంలో స్థిరంగా ఉండడం కష్టమవుతుంది. అందుకే మీరు పదేపదే గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే సాధన చేసే వారికి ఇంద్రియ నిగ్రహం తప్పనిసరిగా ఉండాలి. ధ్యానం మాత్రమే చేయడం సరిపోదు, ధ్యానంతో పాటు ఇంద్రియాలను గమనించడం, వాటి పట్ల ఉన్న ఆకర్షణను తగ్గించుకోవడం, నిత్యమైనది, అనిత్యమైనది అనే వివేకాన్ని పెంచుకోవడం

కూడా అవసరం.

మీరు శరీరం కాదు, మీరు ఆత్మ అనే సత్యాన్ని ఎంతగా గుర్తుంచుకుంటారో, అంతగా శరీరం పట్ల ఉన్న మితిమీరిన ఆకర్షణ తగ్గుతుంది. ఇంద్రియ భోగాల పట్ల ఆకర్షణ తగ్గినప్పుడు, మీ మనసు పరమాత్మ వైపు ప్రయాణించడం ప్రారంభిస్తుంది.

అందుకే శంకరాచార్యులు సాధకుడికి "నిత్యానిత్య వస్తు వివేకం" ఉండాలి అని చెప్పారు. సాధకుడికి మొదటగా సాధన చతుష్టయ సంపద ఉండాలి. ఈ సాధన చతుష్టయ సంపద లేకపోతే సాధకుడు సాధనలో ఎక్కువ కాలం స్థిరంగా ఉండలేడు అనే విషయాన్ని శంకరాచార్యులు స్పష్టంగా చెప్పారు. అందుకే సాధకుడికి సాధన చతుష్టయం తప్పనిసరిగా ఉండాలి అని చెప్తూ ఉంటారు.

మరి సాధన చతుష్టయాన్ని పాటించకుండా కేవలం ధ్యానం చేస్తూ ఉంటే ఏమవుతుంది? క్రమంగా ధ్యానం పట్ల విముఖత కలుగుతుంది. ఎందుకంటే సాధన చతుష్టయంలో మొదటి అంశమే నిత్యానిత్య వస్తు వివేకం. నిత్యమైనది ఏది? అనిత్యమైనది ఏది? శాశ్వతమైనది ఏది? అశాశ్వతమైనది ఏది? అనే వివేకం సాధకుడికి ఉండాలి. ఈ వివేకం ఉన్నప్పుడే ఇంద్రియాల పట్ల ఉన్న ఆకర్షణ తగ్గుతుంది. ప్రపంచం గురించి మీ ఆలోచనా విధానం మారుతుంది. "శరీరమే శాశ్వతం" అనే భావం కూడా తొలగిపోతుంది. నిత్యమైన ఆత్మను, అనిత్యమైన శరీరాన్ని, ప్రపంచాన్ని వేరు చేసి చూడ గలిగినప్పుడే మాయ ప్రభావం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

3) ధర్మాన్ని ఆచరించకుండా చేసేది కూడా ఈ మాయే:

ధర్మాన్ని ఆచరించకుండా చేసేది కూడా ఈ మాయే. మీరు మాయకు

వశమైనప్పుడు ధర్మం ఏమిటో తెలిసినా, దానిని ఆచరణలో పెట్టలేకపోతారు, ఎందుకంటే ధర్మం మీకు తెలుసు. ఇప్పుడు చూడండి జీవులను హింసించడం పాపం అని మీకు తెలుసు, పండగ రోజునో, శనివారం రోజునో, శుక్రవారం రోజునో మీరు మాంసాహారం తినరు, పూజ చేసిన రోజున మాంసాహారం ముట్టుకోరు. కానీ మిగతా రోజుల్లో మాత్రం తింటూ ఉంటారు అంటే మిగతా రోజుల్లో అది పాపం అని మీకు తెలియదా? అంటే జీవులను హింసించడం పాపం అని మీకు తెలుసు, మాంసాహారం తీసుకోవడం తప్పు అని కూడా తెలుసు. అయినప్పటికీ మిగతా రోజుల్లో ఎందుకు మానడం లేదు? "ఆ రోజు భగవంతుడికి ఇష్టం ఉండదు" అని అనుకుని ఆ రోజున మాత్రమే మానుతున్నారు అంటే భగవంతుడు ఆ రోజు మాత్రమే ఉన్నాడా? ఆ రోజు మాత్రమే ధర్మం గుర్తుకు వస్తుందా? మిగతా రోజుల్లో ధర్మం అవసరం లేదా?

మరి మిగతా రోజుల్లో పాపం చేయవచ్చా? అంటే, ఎందుకు మీరు మిగతా రోజుల్లో పాపం చేస్తున్నారు? ధర్మం తెలిసినా ఎందుకు ఆచరించ లేకపోతున్నారు? దానికి కారణం ఇంద్రియ లోలత్వం, ఇంద్రియాల పట్ల ఉన్న ఆకర్షణ. నోరు ఒకసారి ఆ రుచికి అలవాటు పడిపోయిన తర్వాత, ఆ రుచిని వదులుకోలేకపోతారు. అందుకే మిగతా రోజుల్లో భగవంతుడు లేనట్టుగా, ఆ రోజు మాత్రమే భగవంతుడు ఉన్నట్టుగా మాంసాహారం మానేస్తూ ఉంటారు. కాబట్టి ధర్మాన్ని తెలుసుకోవడం మాత్రమే సరిపోదు. ధర్మాన్ని ప్రతిరోజూ ఆచరించాలి.

మరి ఈ విధంగా చూస్తే, పండగ రోజు, పూజ చేసిన రోజు అని సాత్విక ఆహారమే తీసుకుంటారు, మాంసాహారం ముట్టుకోరు. కార్తీక మాసంలో మాంసాహారం ముట్టుకోరు, కొంతమంది ధనుర్మాసంలో కూడా మాంసాహారం

ముట్టుకోరు. ఇలా కొన్ని రోజులు లేదా కొన్ని నెలలు కొన్ని నియమాలను పాటిస్తూ ఉంటారు. అయితే ఇది ధర్మం కాదని తెలియక కాదు, ధర్మం ఏమిటో తెలుసు. కానీ ఇంద్రియ లోలత్వం వల్ల, ఇంద్రియాల పట్ల ఉన్న ఆకర్షణ వల్లే ఈ అలవాటు కొనసాగుతుంది, అంటే మాయకు వశమైనప్పుడు ధర్మాన్ని తెలుసుకున్నా, దాన్ని సంపూర్ణంగా ఆచరించకుండా చేసేస్తుంది.

అందుకే మాయకు వశమైనవారు ధర్మం తెలిసినా ధర్మాన్ని ఆచరించలేరు. కేవలం తెలుసుకోవడం వల్ల ప్రయోజనం లేదు, తెలిసిన ధర్మం జీవితంలో ఆచరణలోకి వచ్చినప్పుడే దాని ఫలితం ఉంటుంది.

4) సత్యాన్ని తెలుసుకోకుండా చేసేది కూడా మాయే:

సత్యాన్ని తెలుసుకోకుండా చేసేది కూడా మాయే. ఇప్పుడు మీరు ఎంత చెప్పినా, చూడండి కొంత మందికి విగ్రహారాధన మీదే మోజు ఉంటుంది. కొంత మందికి ధ్యానం చేయడం అంటే విగ్రహారాధన మానవలసి వస్తుందేమో అనే భయం ఉంటుంది. అసలైన దైవం చూపిస్తున్నప్పటికీ, దైవం యొక్క ప్రతిమనే పట్టుకుని ఉండటానికి ప్రయత్నిస్తారు. అంటే వీళ్ళు కచ్చితంగా మాయకు వశమై ఉన్నారని అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు వాళ్ళు ఒక అరటిపండు తినాలి అనుకున్నప్పుడు, మీరు వారికి బొమ్మ అరటిపండు ఇస్తే తింటారా? తినరు. ఎందుకంటే అది నిజమైన అరటిపండు కాదని వారికి తెలుసు, కానీ భగవంతుని ప్రతిరూపాన్ని పట్టుకుని, “భగవంతుడు ఆత్మగా ఉన్నాడు” అని చెప్తుంటే ఎందుకు నమ్మడం లేదు? ఇక్కడే మాయ ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు అనిపించడమే మాయ. సత్యం కాని దాన్ని సత్యంగా భావించేలా చేయడం మాయ యొక్క ప్రభావం.

ఇంత బలంగా మాయలో ఉన్నారని మీరు అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే ధ్యానం గురించి చెప్పి, "ఆత్మే భగవంతుడు" అని ఇంత స్పష్టంగా వివరించి, ఈ ఆత్మ వల్లే ఈ శరీరానికి చైతన్యం, వైభోగం వస్తుందని ప్రాక్టికల్‌గా కూడా చూపిస్తున్నాం. ఒక శవంలో ఆత్మ అనే భగవంతుడు లేకపోతే అది ఏ పనీ చేయలేదు. అదే ఆత్మ అనే భగవంతుడు శరీరంలో ఉన్నప్పుడు, ఆ శరీరం ద్వారా ఎన్నో పనులు చేయగలుగుతున్నారని ఇంత స్పష్టంగా, ప్రూఫ్‌తో సహా చెప్తున్నప్పటికీ, కొంత మందికి ఆ సత్యం నమ్మ బుద్ధి కావడం లేదు, అంటే వారు ఎంత బలంగా మాయకు వశమై ఉన్నారో మీరు అర్థం చేసుకోవచ్చు. అందుకే అసత్యాన్ని సత్యంగా అనిపించడం, సత్యాన్ని అంగీకరించకుండా చేయడం మాయ లక్షణం. ఈ మాయకు వశమైన వారికి సత్యాన్ని గ్రహించే శక్తి, సత్యాన్ని తెలుసుకునే శక్తి ఉండదు. దాని వల్ల ఎన్ని నష్టాలు వస్తున్నాయో మీరు ఆలోచించండి. మాయకు వశమైనప్పుడు సత్యాన్ని తెలుసుకోనివ్వకుండా చేస్తుంది, అసత్యాన్ని సత్యంగా భావించేలా చేస్తుంది. ధర్మం ఏమిటో తెలిసినా దాన్ని ఆచరించ లేకపోతారు. ఇలా మాయకు వశమై మనిషి తన జీవితంలో ఎన్నో నష్టాల్లో కూరుకుపోతూ ఉంటాడు.

5) దైవంతో, గురువుతో అనుసంధానం ఏర్పడదు:

దైవం పట్ల నమ్మకం ఉండదు, గురువు పట్ల విశ్వాసం ఉండదు. గురువు సత్యాన్ని బోధిస్తున్నప్పటికీ, ఆ మాటలను విశ్వసించకుండా సందేహిస్తూ ఉంటారు. దైవం పట్ల నమ్మకం లేకపోవడం, గురువు పట్ల విశ్వాసం లేకపోవడం, సత్యాన్ని తెలుసుకున్నా ఆచరణలో పెట్టలేకపోవడం ఇవన్నీ మాయకు వశమైన వారి యొక్క లక్షణాలే, ఇదే మాయ ప్రభావం అని మీరు అర్థం చేసుకోవాలి.

కొంతమంది ఇలా అంటారు "గురువు వల్ల ఏమవుతుంది? మీరు దైవాలు అన్నప్పుడు" అని. కానీ గురువు చెప్పినప్పుడు, ఆ మాటలను మీరు విశ్వసించాలి, అనుమానించకూడదు. ఎందుకంటే అన్నీ తెలిసినవాడు, అంతటి జ్ఞానాన్ని పొందినవాడు గురువు, ఇంకా అజ్ఞానంలో ఉన్నవాడు, తన అసలు స్వరూపం తెలియని వాడు శిష్యుడు. అందుకే గురువు "మీరు దైవ స్వరూపులే" అని చెప్పినప్పటికీ, గురువు మాటలను విశ్వసించకుండా, "మన వల్ల ఏమవుతుంది? మనం దైవాలమా? మనం జీవులమే కానీ దేవుళ్ళం కాదు" అనే సంశయ చిత్తంతో ఉంటారు. మీరు మాయకు వశమైనప్పుడు ఇలాంటి సందేహాలు కలుగుతూనే ఉంటాయి.

దైవం పట్ల భక్తి, శ్రద్ధ, గురువు పట్ల విశ్వాసం ఉన్నవాడే మాయను జయించగలడు. సృష్టి అంతా దైవం యొక్క శక్తితోనే నడుస్తుంది అని తెలిసినా, మాయకు వశమైనప్పుడు ఈ మాటలను వింటారు కానీ మళ్ళీ మర్చిపోతారు. ఒకసారి విచారణ చేసుకుంటే, దైవం కేవలం మీకు కష్టం వచ్చినప్పుడు మాత్రమే గుర్తుకు రావడం కాదు, భోగాల్లో, సుఖాల్లో, సంతోషాల్లో కూడా దైవం గుర్తుకు వచ్చినవాడే నిజమైన యోగి అవుతాడు. సుఖాల్లోనూ, భోగాల్లోనూ, సంతోషాల్లోనూ, కష్టాల్లోనూ ప్రతి పరిస్థితిలో దైవం మీకు గుర్తుకు వస్తే, మీరు యోగం వైపు ప్రయాణిస్తున్నట్టే.

కానీ కష్టం వచ్చినప్పుడు "ఇదంతా భగవంతుడు చేస్తున్నాడు" అని, అదే సమయంలో భోగాలు, సుఖాలు వచ్చినప్పుడు "ఇది నా ప్రతాపం వల్ల వచ్చింది, నేను చేయగలిగాను" అని అనుకోవడం కూడా మాయే. కష్టం వచ్చినప్పుడు దైవాన్ని గుర్తు చేసుకుని, సుఖం వచ్చినప్పుడు తనను తాను గుర్తు చేసుకోవడం జ్ఞానం కాదు. ప్రతి పరిస్థితిలోనూ దైవమే ఆధారం అని

గుర్తుంచుకోవాలి. అందుకే దైవం పట్ల భక్తి ఉండాలి, శ్రద్ధ ఉండాలి, గురువు పట్ల సంపూర్ణ విశ్వాసం ఉండాలి. ఎవరైతే గురువు చెప్పిన సత్యాన్ని విశ్వసించరో, వారు విశ్వమంతా తిరిగినా, ఎక్కడికి వెళ్ళినా, ఎన్ని అనుభవాలు పొందినా, వారి జీవితంలో నిజమైన శాంతి లభించడం కష్టం.

మరి ఇలా ప్రపంచం వైపు తిరుగుతూ, సత్యాన్ని మరిచిపోయి జీవించేవాడు ఎవరు అంటే మాయకు వశమైన వాడు.

6) భగవంతుడు, జీవుడు ఇద్దరూ ఆత్మ స్వరూపులే అయినప్పటికీ భగవంతుడు మాయకు ఆధీనుడు కాదు.

మాయ భగవంతుడి ఆధీనంలో ఉంటుంది, కానీ మానవుడు మాత్రం మాయకు ఆధీనమై జీవిస్తూ ఉంటాడు. ఇద్దరూ ఆత్మ స్వరూపులే, భగవంతుని అంశులే కదా? అందుకే మీరు అందరూ ఆత్మ స్వరూపులే అంటే మీరు, భగవంతుడు వేరు కాదు. "అహం బ్రహ్మాస్మి", "తత్త్వమసి" అనే సత్యాన్ని మీరు తెలుసుకున్నప్పుడు, భగవంతుడు వేరు, మీరు వేరు అనే భావం ఉండకూడదు. భగవంతుడు, మీరు ఒకటే అనే సత్యాన్ని గ్రహించాలి. అయితే ఈ దేహాన్ని ధరించి, మనసు అనే ఒక సాధన ఏర్పడినప్పుడు, ఆ మనసు మాయకు వశమైతే జీవుడు వేరు, దేవుడు వేరు అనే భావన కలుగుతుంది. ఎందుకు అలా అనుకుంటున్నారు? ఈ శరీరం అనే తొడుగు ఏర్పడినప్పుడు, మనసు ఏర్పడినప్పుడు, ఆ మనసు మాయకు వశమైనప్పుడే "నేను వేరు, భగవంతుడు వేరు" అనే ద్వైత భావన ఏర్పడుతుంది. మీ జీవితంలో ఒక గురువు వచ్చి సత్యాన్ని బోధిస్తూ, "ఇదంతా మిథ్య. శరీరం మిథ్య, మనసు మిథ్య, బుద్ధి మిథ్య, ఆత్మ ఒక్కటే శాశ్వతం" అని చెప్పినప్పుడు, ఆ సత్యాన్ని కేవలం విని నమ్మడం మాత్రమే సరిపోదు. మీ సాధన ద్వారా, ధ్యానం ద్వారా

మాయను తొలగించుకోవాలి.

ఎందుకంటే గురువు ఎంత చెప్పినా, ఊరికే చెప్పినంత మాత్రాన ఆ సత్యంపై సంపూర్ణమైన నమ్మకం కలగదు, అది మీ అనుభవంలోకి రావాలి. అందుకే "జీవుడు మాయాధీనుడు, దేవుడు మాయాధీశుడు." జీవుడు మాయ చేతిలో ఉంటాడు, కానీ దేవుడు మాయను తన వశంలో ఉంచుకున్నవాడు. తాను సృష్టించిన మాయ తన ఆధీనంలోనే ఉంటుంది. మీరు కూడా సాధన ద్వారా మాయను జయించినప్పుడు, మాయకు బానిసగా ఉన్న జీవ స్థితి నుంచి బయటపడి, మీ అసలు ఆత్మ స్వరూపాన్ని తెలుసుకునే స్థితికి ఎదుగుతారు.

మరి ఈ విధంగా సత్యాన్ని తెలుసుకున్నవారు, ఎప్పుడైతే ప్రపంచం వైపు ఆకర్షితులవుతున్నారో, అప్పుడు మీరు మాయకు వశమైనట్టే లెక్క. అందుకే మీరు ఎప్పటికప్పుడు విచారణ చేసుకోవాలి. రమణ భగవాన్ గానీ, మహాత్ములు గానీ సాధనలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఇదే విషయాన్ని చెప్తూ ఉంటారు "మీరు మాట్లాడే మాటను, చేసే పనిని, మీ ఆలోచనను ఎప్పటికప్పుడు విచారణ చేసుకోండి" అని. ఈ విచారణ లేకపోతే మీరు ఏం మాట్లాడుతున్నారు? ఏం చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? అనేది మీకే స్పష్టంగా తెలియదు. ఎందుకంటే మానవుడు ప్రతిక్షణం మాయకు వశమయ్యే అవకాశం ఉంది. అందుకే తెలియకుండానే మాయలోనే జీవిస్తూ ఉంటాడు. ఇప్పుడు మీ జీవితంలో మాయ ప్రభావం ఎక్కువైందని అనుకోండి. మీరు ఎదుటి వారికి "శరీరం శాశ్వతం కాదు" అని చెప్తారు. కానీ అదే సమయంలో శరీరానికి సంబంధించిన బంధాల్లో మీరు మరింతగా కూరుకుపోతుంటారు. ఎందుకు అంటే, "నా బిడ్డలు, నా బిడ్డలు" అనే మమకారంలో పడి, వారి కోసం ఎన్నో

త్యాగాలు చేస్తూ ఉంటారు. ఈ బంధాలు కూడా అశాశ్వతమైనవే అని తెలిసినా, వాటి పట్ల ఉన్న మమకారం నుంచి బయటపడే స్థితి ఇంకా రాలేదు, అందుకే సత్యం తెలిసినా దాన్ని ఆచరణలో పెట్టుకోలేక పోవడానికి కారణం కూడా మాయే.

మీ జీవితాల్లో మాయ ఎంత బలంగా ఉందో మీరు దీని ద్వారా అర్థం చేసుకోవాలి. ఏదైనా ఒక పని చేయాల్సి వచ్చినప్పుడు, మీరు చెప్పిన మాటను నిలబెట్టుకోలేని పరిస్థితి వచ్చినా, మీరే పక్కవాళ్ళను ఒప్పించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు "తప్పదు కదండీ, తప్పించుకోలేము కదండీ" అని కారణాలు చెప్తూ ఉంటారు. ఒకవేళ ఎవరైనా మిమ్మల్ని నిందించినప్పుడు, "వాళ్ళు నిందిస్తున్నది నా శరీరాన్ని మాత్రమే, నేను మాత్రం సత్యంలో జీవిస్తున్నాను" అనే భావన మీలో కలగడం లేదు. అంటే మీ జీవితంలో మాయ ఎంత బలంగా పనిచేస్తుందో, మీరు ఎంతగా మాయకు వశమైపోయారో, చివరికి మీకు మీరే విచారణ చేసుకుని తెలుసుకోవాల్సిన విషయం. సత్యాన్ని తెలుసుకోవడం మాత్రమే కాదు ప్రతి మాటలో, ప్రతి ఆలోచనలో, ప్రతి పనిలో ఆ సత్యాన్ని ఆచరించగలుగుతున్నారా? లేదా? అని ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు పరిశీలించు కోవడమే నిజమైన విచారణ.

ఇప్పుడు చూడండి, మీరు ధ్యానం క్లాసుకు రావాలి అంటే ఎంతో ఆలోచిస్తారు "మా ఆయన ఒప్పుకోలేదు, మా పిల్లలు ఒప్పుకోలేదు" అని అంటారు. కానీ మీ పుట్టింట్లో ఏదైనా ఫంక్షన్ ఉందంటే, భర్తతో గొడవపడైనా సరే అక్కడికి వెళ్తారు. ఎందుకు? అక్కడ "అమ్మ ఏమనుకుంటుంది? నాన్న ఏమనుకుంటారు? అన్నయ్య ఏమనుకుంటాడు?'' అనే ఆలోచనే ముందుంటుంది. కానీ "భగవంతుడు ఏమనుకుంటాడు? నేను ఏం చేయాలి?

నా ఆధ్యాత్మిక ప్రయాణానికి ఏది ఉపయోగపడుతుంది?" అనే ఆలోచన మాత్రం రావడం లేదు. మరి ఎంత సత్యం తెలిసినా, ఆ సత్యం లో జీవించ లేకపోవడానికి కారణం కూడా ఈ మాయే అని మీరు అర్థం చేసుకోవాలి. "ఏమనుకుంటారు? ఏమనుకుంటారు?" అనే భయంలోనే జీవిస్తూ మీ ఇష్టాలను, మీ ఆశయాలను పక్కన పెట్టేస్తున్నారు.

మిమ్మల్ని ప్రేమించిన వాళ్ళు మీకు బంధువులు కారు అని కాదు, కానీ మీ ఇష్టాన్ని, మీ ఆశయాలను, మీరు నడుస్తున్న ఆధ్యాత్మిక మార్గాన్ని వారు గౌరవించకపోయినా, ఆ విషయాన్ని మీరు గుర్తించ లేకపోతున్నారు. వాళ్ళు ఏమనుకుంటారు?" అనే ఆలోచనలతోనే మళ్ళీ మళ్ళీ వెనక్కి తగ్గుతున్నారు, ఇది కూడా మాయే. మరి మీ ఆశయాలను మీరు గౌరవించాలి. మీకు సరైనదని అనిపించిన, మీ ఆత్మోన్నతికి ఉపయోగపడే ఆశయాలను మీరు గౌరవించాలి. మీరు చేసే మంచి పనులను వారు ఏదో ఒకరోజు గ్రహిస్తారు, మిమ్మల్ని చూసి నేర్చుకుంటారు, వాళ్ళలో ఎలాంటి మార్పు కనిపించకపోయినా, ఇంకా మీరు వాళ్ళకు అనుకూలంగానే జీవించాలని ప్రయత్నిస్తుంటే, అదే మాయ ప్రభావం.

అజ్ఞానంలో ఉన్నప్పుడు మీరు అలా జీవించారు, కానీ జ్ఞానం వచ్చిన తర్వాత ఈ సృష్టిలో భగవంతుడి కంటే గొప్ప వారు ఎవరు? ఈ జన్మకు కారణమైన ఆ సృష్టికర్త కంటే గొప్పది ఏముంది? ఈ ప్రాపంచిక బంధాల కంటే భగవంతుడు తక్కువ వాడు కాదు, భగవంతుడే గొప్పవాడు. ఈ బంధాలన్నీ ఈ జన్మకు మాత్రమే పరిమితం ఈ భార్య, ఈ భర్త, ఈ తల్లిదండ్రులు, అన్నదమ్ములు, పిల్లలు, బంధువులు వీళ్ళతో ఉన్న సంబంధాలన్నీ ఈ జన్మ వరకే. కానీ జన్మజన్మలకూ మీకు ఉన్న నిజమైన బంధం

భగవంతుడితోనే ఉందని మీరు గ్రహించినప్పుడు, ఆత్మజ్ఞానం పొందడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తారు.

ఈ మాయను జయించాలంటే విచారణతో పాటు సాధన కూడా అవసరం. ముఖ్యంగా మీరు ధ్యానం చేయాల్సిన సమయంలో, ధ్యానాన్ని వదిలేసి ప్రాపంచిక విషయాల కోసం వెళ్ళడం చాలా తప్పు. ఎందుకంటే మీరు ఏదో ఒకరోజు ప్రపంచం కోసం ధ్యానాన్ని వదిలేస్తే, క్రమంగా ప్రపంచమే ముఖ్యమైపోతుంది, ధ్యానం వెనుకబడిపోతుంది. అందుకే మీకు ఏది శాశ్వతమైనది, ఏది అశాశ్వతమైనది, ఏది మీ ఆత్మోన్నతికి దారితీస్తుంది, ఏది మిమ్మల్ని మాయలోకి లాగుతుంది అనే విషయాన్ని ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటూ, సాధనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

మీకు ఉన్న ఏ బంధమైనా అది ప్రాపంచిక బంధమే అని గుర్తుంచుకోవాలి. అది భార్యాభర్తల బంధం కావచ్చు, తల్లి పిల్లల బంధం కావచ్చు, బంధువుల బంధం కావచ్చు, చుట్టాలు పక్కవాళ్ళతో ఉన్న సంబంధం కావచ్చు ఇవన్నీ ప్రాపంచికమైనవే.

కానీ భగవంతుడితో మీకున్న బంధం శాశ్వతమైనదని తెలుసుకున్న మీరు, ఆ బంధానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. మీరు ఇవ్వకపోతే, మీరు మాయకు వశమైపోతున్నారని మీకు మీరే గ్రహించాలి. “నేను మాయకు వశమైతే జీవుడిగానే ఉంటాను, మాయను దాటితే దేవుడిగా ఎదుగుతాను” అనే విషయాన్ని మీరు ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి. భగవంతుడిని చేరడానికి, భగవంతుడికి మరియు జీవుడికి మధ్యలో ఉన్న మాయ అనే తెరను దాటాలి. ఆ మాయను దాటడమే మీ సాధన యొక్క ప్రధాన లక్ష్యం అని మీకు మీరే అర్థం చేసుకోవాలి.

ఎవ్వరూ మీకు శత్రువులు కాదు, మీ మనసే మీకు శత్రువు. మాయకు వశమైన మనసు మిమ్మల్ని ప్రపంచం వైపు లాగుతుంది, మాయను జయించిన మనసు మిమ్మల్ని పరమాత్మ వైపు, ఆత్మ వైపు తిప్పుతుంది. సాధన ప్రారంభంలో కొంతకాలం మాత్రమే మీకు కష్టం అనిపిస్తుంది. కొంతకాలం మాయ ద్వారా భగవంతుడు మీ జీవితంలో ఎన్నో మార్పులు, పరీక్షలు తీసుకువస్తూ ఉంటాడు. అవి ఆయన పరీక్షలు అని మీరు అర్థం చేసుకోవాలి. "ఓ భగవంతుడా! నాతో ఆడుతున్నావు, నాకు పరీక్ష పెడుతున్నావు" అని మీకు మీరే గ్రహించేంతటి ఆధ్యాత్మిక శక్తిని పెంచుకోవాలి. ఆ పరీక్షలను గుర్తించి, మొదట్లో వచ్చే కష్టాలను దాటగలిగినప్పుడు, భగవంతుడే మిమ్మల్ని రెండు చేతులతో దగ్గరకు తీసుకుంటాడు. అందుకే, మీరు ఒక్క అడుగు వేస్తే, భగవంతుడు పది అడుగులు మీ దగ్గరకు వచ్చి, మీ చేయి పట్టుకుని ముందుకు తీసుకెళ్తాడని అంటారు.

మొదట్లో పరీక్షలు ఉంటాయి, కష్టాలు ఉంటాయి, చాలా బాధలు కూడా ఉంటాయి. "నేను 80 శాతం కాలిపోయాను" అని, మాయ ప్రభావం ఉంటే ధ్యానాన్ని వదిలేద్దాం అనే ఆలోచన వచ్చేది కానీ గురువు నా ప్రక్కనే ఉండి, మాయ నుంచి బయటపడేలా ఎప్పటికప్పుడు సరిదిద్దుతూ, మార్గం చూపిస్తూ వచ్చాడు. లోకుల మాటలను విననివ్వకుండా, ఎప్పటికప్పుడు సరైన దారిలో నడిపిస్తూ వచ్చాడు.

చాలామంది "పూజలు మానేసింది, శవాల గది కట్టారు, అందుకే ఇంత జరిగింది, భగవంతుడికి కోపం వచ్చింది" అని అన్నారు. కర్మలు చేసేది మనం, కారణాన్ని మాత్రం భగవంతుడి పైకి నెట్టేస్తూ ఉంటాము. నిజానికి ఏ భగవంతుడికీ ఏ జీవుడి మీద ఎప్పుడూ కోపం ఉండదు. ఎప్పుడు ఆయన కలగజేసుకుంటాడంటే, అధర్మంగా ప్రవర్తించినప్పుడు, ధర్మాన్ని వదిలినప్పుడు,

అధర్మాన్నే జీవిత ధ్యేయంగా పెట్టుకున్నప్పుడు, అప్పుడు దుఃఖం ద్వారా శిక్షణ ఇస్తూ, దుష్టులను శిక్షిస్తూ ఉంటాడు.

ఎందుకంటే అధర్మ పరుల వల్ల లోక వినాశనం జరుగుతున్నప్పుడు మాత్రమే భగవంతుడు కలగజేసుకుంటాడు. ధర్మం అంటే మానవ జీవితం దేని కోసం వచ్చిందో, దాని కోసమే జీవించటం. మీరు మానవ జన్మ సాధన కోసం వచ్చిందని తెలుసుకున్నారు, సాధనతో జీవిస్తున్నారు కాబట్టి, మీరు అధర్మంలో లేరు.

"ఎవరి ఫలితం వాళ్ళే అనుభవిస్తారు" అని తెలుసుకున్నప్పటికీ, కూడా తప్పులు చేస్తూ ఉంటే శిక్షలు అనుభవించాలి. అందుకే బుద్ధుడు "తెలియక చేసిన తప్పుకు చిన్న శిక్ష, తెలిసి చేసే తప్పుకు పెద్ద శిక్ష" అని చెప్పాడు. ఇంత తెలిసి కూడా మళ్ళీ మళ్ళీ తప్పులు చేస్తూ, పాపాలు చేస్తూ ఉంటే, మీరు వెనుకటి జన్మల వైపు వెళ్ళాల్సి వస్తుంది. మరి ఆ వెనుకటి జన్మలు ఏంటి? మానవ జన్మకు ముందు కూడా ఎన్నో జన్మలు ఉన్నాయి, మళ్ళీ అక్కడి నుంచే మానవ జన్మకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

మరి ఈ విధంగా మాయకు వశం కాకుండా ఉంటే ఎలా ఉంటారు? మీరు సత్యాన్ని సత్యంగా తెలుసుకుంటారు. మీ ప్రయాణం సత్యం వైపు ఉంటుంది. కానీ సత్యం కాని ప్రపంచం పట్ల మీకు అనవసరమైన ఆకర్షణ ఉండదు, ఇంద్రియ నిగ్రహం ఉంటుంది. మీరు మాయను జయించినప్పుడు ఒక్క ఇంద్రియం మీద కూడా మీ పట్టు తప్పకుండా ఉండాలి. ఏదైనా ఇంద్రియం పట్ల ఆకర్షణ కలుగుతున్నప్పుడు, "ఓహో! నేను ఇప్పుడు దీని వైపు ఆకర్షితుడవుతున్నాను, అంటే మళ్ళీ మాయకు వశమవుతున్నాను" అని మీరు గమనించుకోవాలి. ఇప్పుడు చూడండి, చాలామంది టూర్లకు కూడా వెళ్తారు.

ఎందుకు? "అది కూడా చూడాలి, అక్కడ కూడా చూడాలి" అనే కోరికతో వెళ్తారు. ఆ కోరిక బలంగా మిమ్మల్ని లాగుతున్నప్పుడు, మీలో మాయ ప్రభావం ఉందని గుర్తించాలి. ఏ ఇంద్రియం పట్ల మీకు అనవసరమైన ఆకర్షణ ఉన్నా, మీరు మళ్ళీ మాయకు వశమవుతున్నారని అర్థం.

ఇక్కడ రెండు విషయాలను వేరు చేసి చూడాలి కొన్ని అవసరాలు ఉంటాయి, మరికొన్ని అవసరం లేనివి ఉంటాయి. కొన్ని శాశ్వతమైనవి ఉంటాయి, కొన్ని అశాశ్వతమైనవి ఉంటాయి. అశాశ్వతమైన వాటిని తప్పనిసరిగా కావాలి అని పట్టుబడితే, మీరు మాయకు వశమైనట్టే.

7) దైవం పట్ల కంటే ప్రపంచం పట్ల ఆకర్షణ పెరిగితే, మీరు మాయకు వశమైనట్టే:

దైవం పట్ల కంటే ప్రపంచం పట్ల ఆకర్షణ పెరిగితే, మీరు మాయకు వశమైనట్టే. మీ దృష్టి ప్రపంచం వైపు మళ్ళిందంటే, మీరు మాయకు వశమవుతున్నారని గుర్తించాలి. ఇవన్నీ మీరు తెలుసుకుని, నిరంతరం సాధన చేస్తూ ఉంటే, మాయ నుంచి బయట పడగలిగే శక్తి మీలో పెరుగుతుంది. అందుకు ఒక్కటే మార్గం మీ మనసు ప్రపంచం వైపు తిరిగితే మాయకు వశమైనట్టే, అధర్మం వైపు తిరిగితే మాయకు వశమైనట్టే, అసత్యం వైపు తిరిగితే మాయకు వశమైనట్టే.

ఈ కారణాలన్నింటినీ మీరు తెలుసుకుని, వాటిని ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటే, మీరు మాయను జయించగలరు. మీరు దైవత్వం వైపు ఎదిగితే మాయపై ఆధిపత్యం పొందుతారు. జీవుడి స్థితిలోనే మిగిలిపోతే మాయ ఆధీనంలోనే ఉండిపోతారు. ప్రతి క్షణం సత్యం తెలిసినా సత్యాన్ని ఆచరించ లేనప్పుడు జీవుడికి దుఃఖమే మిగులుతుంది. ఎందుకంటే మాయను

జయించే మార్గం గురువు ద్వారా మీరు తెలుసుకున్నారు, మాయ అంటే ఏమిటో తెలుసుకున్నారు, మాయకు వశమవడం అంటే ఏమిటో కూడా తెలుసుకున్నారు. ఇన్ని తెలిసిన మీరు జీవితంలో ఇంకా దుఃఖాన్ని అనుభవిస్తున్నారంటే, మీరు మాయకు వశమవుతున్నారని అర్థం.

గురువు ఎన్నో విషయాలు చెప్తాడు, కానీ గురువు చెప్పిన వాటిని జీవితంలో ఆచరించినప్పుడు మాత్రమే మీరు దుఃఖాన్ని జయించగలరు. ఎప్పుడైతే విని వదిలేస్తారో, ఆచరణలో పెట్టుకోరో, అప్పుడు మళ్ళీ మాయకు వశమై దుఃఖంలో కూరుకుపోతారు. దుఃఖం నుంచి బయటపడటానికి "ప్రపంచం వైపు తిరిగిన మనసు దుఃఖంలోనే ఉంటుంది, పరమాత్మ వైపు తిరిగిన మనసు ఆనందంలో ఉంటుంది". ఇన్ని విషయాలను గురువు మీకు చెప్పి, సాధనను అందించినప్పటికీ మీ జీవితంలో ఇంకా దుఃఖం ఉంటే, మీరు మాయకు బందీ అయ్యారని, మాయ వశంలో ఉన్నారని తెలుసుకోవాలి. ఆ విషయాన్ని గుర్తించినప్పుడు మీరు మరింత జాగ్రత్తగా సాధన చేస్తూ ముందుకు వెళ్ళాలి.

ఒక మనిషి చనిపోయాడని అనుకుందాం. చనిపోయినప్పుడు కొంతమంది విపరీతంగా ఏడుస్తారు, మరణించినప్పుడు ఏడవడం సహజమే. కానీ చాలామంది ఆ వ్యక్తిని పదే పదే తలుచుకుంటూ, నిరంతరం ఏడుస్తూ ఉంటారు. పెద్దలు చెప్తారు, మీరు ఇక్కడ ఎంత దుఃఖపడతారో, ఆత్మకు అదే ఆహారమై, ప్రేతాత్మగా తిరుగుతూ ఉంటుందని, పైకి వెళ్ళలేదని చెప్తారు. ఒకవేళ ఎవరైనా ఎక్కువగా ఏడవకపోతే, ప్రక్క వాళ్ళు "మొగుడంటే ప్రేమ లేదు, పిల్లలంటే ప్రేమ లేదు, అందుకే ఏడవడం లేదు" అని అంటారు.

కానీ జ్ఞానం వున్న వాళ్ళు అయినా చెప్పాలి, "మనకెందుకులే" అని

మౌనంగా ఉండటం కూడా ఒక రకమైన భయమే, అధైర్యమే. ఏమనుకుంటారో అనే భయంతో తెలిసిన సత్యాన్ని చెప్పకుండా ఉండటం వల్ల అజ్ఞానం ఇంకా పెరుగుతుంది. తెలిసిన వాళ్ళు నోరు విప్పకపోతే, తెలియని వాళ్ళు తెలియకుండానే ఈ ప్రపంచంలో జీవిస్తే, సత్యం ఎప్పుడు నిలబడుతుంది? అందరూ సత్య మార్గంలోకి ఎలా వస్తారు? సత్య మార్గంలోకి రాకపోతే వారి జీవితాల్లో దుఃఖం ఎలా పోతుంది? అందుకే పత్రి గారు కంకణం కట్టుకుని, మీకు తెలిసినంత వరకు పక్క వాళ్ళకు చెప్పండి, మీకు ఎంత తెలిస్తే అంతే చెప్పండి అంటారు.

ఎందుకంటే మీరు తెలిసినది చెప్పిన తర్వాత, ఎదుటి వారిలో ఇంకా తెలుసుకోవాలనే తపన కలుగుతుంది. ఆ తపనలో ఆత్మానందం ఉంటుంది. “అవతలి వాడి దుఃఖాన్ని పోగొట్టడానికి నేను కొంతైనా సహాయం చేశాను” అనే భావం వచ్చినప్పుడు, అతను ఇంకా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. అందుకే పత్రి గారు ఈ టెక్నిక్ తెలుసుకున్న మనందరికీ, “నీకు ‘ఎ’ తెలిస్తే ‘ఎ’ చెప్పు, ‘బి’ తెలిస్తే ‘బి’ చెప్పు” అని అన్నారు. ఇలాంటి చిన్న చిన్న విషయాలు ప్రజలకు తెలియకపోవడం వల్ల, ప్రతి చిన్న విషయానికీ రాగద్వేషాలు, శోకాలు, మోహాలు పెంచుకుంటూ ప్రతిరోజూ దుఃఖంలో ఉంటున్నారు.

ప్రతి దుఃఖానికి కారణం కూడా మాయే. మాయకు వశమైన వాడు ప్రతి క్షణం దుఃఖంలో ఉంటాడు, ఎప్పుడైతే మీరు మాయను జయించి, పరమాత్మ వైపు తిరుగుతారో, అప్పుడే మాయను దాటగలుగుతారు, అలా మాయను జయించినప్పుడే ఆనందంగా జీవించగలుగుతారు.

మరి ఏది మాయ? మాయ కానిది ఏమిటి? మాయ అసత్యాన్ని సత్యంగా చూపిస్తుంది. దీనికి మహాత్ములు ఇచ్చే ఒక ఉదాహరణ ఎండమావి.

మీరు ఎండలో కారులో ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డు మీద దూరంగా నీళ్ళు ఉన్నట్టుగా కనిపిస్తాయి, దగ్గరికి వెళ్ళి చూస్తే అక్కడ నీళ్ళు ఉండవు, అదే మాయ. "లేనిది ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా కనిపించేదే మాయ". సుఖం కాని దాన్ని సుఖం అనుకోవడం, నిత్యం కాని దాన్ని నిత్యంగా భావించడం, అసత్యాన్ని సత్యంగా భావించడం ఇవన్నీ మాయ. మాయకు వశమైన వారికి, మాయను జయించిన వారికి మధ్య చాలా తేడా ఉంటుంది.

మాయను జయించిన వారికి సత్యం సత్యంగానే తెలుస్తుంది, సత్యంలో జీవించే వాడు పరమాత్మ వైపు తన ప్రయాణాన్ని ఆనందంగా కొనసాగిస్తాడు. ఎవరైతే పరమాత్మ వైపు ప్రయాణిస్తారో! వారి జీవితంలో దుఃఖం తొలగి ఆనంద స్థితి ఏర్పడుతుంది. అందుకే మీరు మాయను జయించాలంటే, తీవ్రంగా సాధన చేయడం, ధ్యానాన్ని పెంచుకోవడం మీ జీవితంలో ముఖ్యమైన భాగాలుగా ఉండాలి. ఇవి రెండూ మీ జీవితంలో స్థిరపడినప్పుడు, మీరు కూడా మాయను జయించి దైవత్వం వైపు ఎదగగలరు.

తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు
వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు
ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.

Telugu Books	**English Books**	**Hindi Books**	**Kannada Books**	**Tamil Books**

జ్ఞానికి అజ్ఞానికి వున్న తేడాలు!

జ్ఞాని ఎందుకు సత్యాన్ని తెలుసుకోవడానికి, ఆ సత్యాన్ని అందరికీ చెప్పడానికి ఎందుకు ప్రయత్నిస్తాడో? అన్న ఆ విషయం గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. అలాగే, అజ్ఞాని ఎందుకు సత్యాన్ని తెలుసుకోలేడు, జ్ఞానికి, అజ్ఞానికి ఉన్న తేడా ఏమిటో కూడా కొంచెం తెలుసుకుందాం.

అజ్ఞాని సత్యాన్ని తెలుసుకోలేడు, కానీ జ్ఞాని సత్యాన్ని తెలుసుకోగలడు. జ్ఞాని సత్యాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తాడు. జ్ఞానికి భగవంతుడి మీద నమ్మకం, విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. అందుకే భగవంతుడి గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తూ, భగవంతుని తత్వాన్ని కూడా తెలుసు కుంటాడు.

ఎందుకు మీ జీవితంలోకి సద్గురువులు వస్తారు అంటే, అజ్ఞానంలో ఉన్న మిమ్మల్ని జ్ఞానవంతులుగా చేయడానికే. మీరు అజ్ఞానంలో ఉన్నప్పుడు అసత్యాన్ని సత్యంగా భావిస్తూ ఉంటారు. అంతేకాదు మీరు అసత్యాన్ని సత్యంగా అనుకుంటున్నంత కాలం జ్ఞానవంతులు కాలేరు. ఎప్పుడైతే గురువు వచ్చి, "ఇది అసత్యం, ఇది సత్యం" అని మీకు తెలియజేస్తారో, అప్పుడు మీరు గురువు మాటను నమ్మి, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, మీరు జ్ఞాన మార్గంలో అడుగు పెట్టినట్టే.

పూజలు చేసినా, తీర్థ యాత్రలకు వెళ్ళినా, గుళ్ళుతిరిగినా, పురాణ కాలక్షేపాలు చేసినా, మీరు ఆధ్యాత్మికతలో ఉన్నామని భావిస్తారు. కానీ నిజంగా ఆధ్యాత్మికతలో లేనట్టే! ఎందుకంటే మీరు అసత్యాన్ని నమ్ముకున్నారు. మరి పురాణం విన్నంత మాత్రాన ఆధ్యాత్మికతలో ఉన్నట్టేనా? అంటే, పురాణాలు

వింటే కథలు తెలుస్తాయి, వాటి అర్థాలు తెలుస్తాయి. కాని ఆధ్యాత్మికతలో ఉన్నట్టు కాదు.

ఎప్పుడైతే మీ జీవితంలోకి ఒక సద్గురువు వచ్చి, "భగవంతుడు అంటే 'ఆత్మ', ఆయన ఎక్కడో లేడు, మీ శరీరంలో ఉన్నాడు, ఈ సృష్టి అంతటా ఆయనే ఉన్నాడు" అని చెబితే, ఆ మాటలు ఎవరికైతే సత్యంగా అనిపిస్తాయో! అలాంటి వారే ఆధ్యాత్మికతలో తొలి అడుగు వేసినట్టు. అప్పటివరకు మీరు ఆధ్యాత్మికతలో ఉన్నామని అనుకోవడం కూడా అజ్ఞానమే అవుతుంది. అయితే, గురువు చెప్పే బోధను అర్థం చేసుకోవడం వల్ల జ్ఞానికి భగవంతుడి మీద నమ్మకం, విశ్వాసం, అచంచలమైన భక్తి ఏర్పడతాయి.

ఎందుకు అంటే, ఈ సృష్టి అంతా పరమాత్మదే! ఈ సృష్టిలోని సర్వ జీవులలో ఆత్మగా ఆ భగవంతుడే ఉన్నాడు. ఈ జీవులను కాపాడుకోవడానికి, ఈ సృష్టిని కొనసాగించడానికి పంచభూతాల ద్వారా సమస్తం ఈ సృష్టికి అందించబడుతుంది అని గురువు ఎప్పుడైతే చెబుతారో, అప్పుడు మీకు ఆ మాటలపై నమ్మకం కలుగుతుంది. ఈ సృష్టిలో ఏది జరిగినా భగవంతుడి ఇష్టంతోనే భూమి మీద జరుగుతుంది అనే విశ్వాసం కూడా మీలో ఏర్పడుతుంది.

భగవంతుడి మీద అచంచలమైన భక్తి ఏర్పడినప్పుడు, "నేను చేస్తున్నాను" అనే అహంకార భావం జ్ఞాని వదిలేస్తాడు. దాని స్థానంలో, "ఇది నా చేత భగవంతుడు చేయిస్తున్నాడు" అని జ్ఞాని ఏర్పరచుకుంటాడు. తాను కేవలం ఒక సాధనం మాత్రమేనని, తన ద్వారా జరిగే ప్రతి కార్యం భగవంతుని సంకల్పం వల్లనే జరుగుతుందని జ్ఞాని అర్థం చేసుకుంటాడు. ఇదే నమ్మకం, విశ్వాసం, భక్తి జ్ఞాని జీవితాన్ని ఆధ్యాత్మిక మార్గంలో మరింత ముందుకు

నడిపిస్తాయి.

అలాగే ఈ జీవులను కాపాడుకోవడానికే పంచభూతాల ద్వారా సమస్తం ఈ సృష్టికి అందించబడుతుంది అని గురువు ఎప్పుడైతే చెబుతారో, మీకు ఆ మాటలపై నమ్మకం కలుగుతుంది. ఏది జరిగినా భగవంతుడి ఇష్టంతోనే భూమి మీద జరుగుతుంది అనే విశ్వాసం కూడా మీకు ఏర్పడుతుంది. అప్పటివరకు మితిమీరిన అహంకారం ఉంటుంది, ఈ మేను ను "నేను" అని అనుకోవడమే పెద్ద అహంకారం. ఈ మేను నేను కాదు, ఆత్మే నేను అని జ్ఞాని తెలుసుకుంటాడు.

"ఈ మేనుతో నేను చేస్తున్నాను" అంటే, లోపల ఉన్న ఆత్మ వల్లే నేను చేస్తున్నాను అని అర్థం. అంటే, భగవంతుడి వల్లే నేను ఈ పని చేస్తున్నాను అని జ్ఞాని తెలుసుకుంటాడు.

అందుకే చేసిన పనులకు గొప్పలు చెప్పుకోకుండా, సాక్షిగా గమనిస్తూ ఉంటాడే తప్ప, గర్వాన్ని పెంచుకోడు. ఎప్పుడైతే మీరు గర్వాన్ని పెంచుకోకుండా ఉంటారో, అప్పుడు మీకు జ్ఞానం ఇంకా ఎక్కువగా తెలుస్తూ ఉంటుంది. ఇంకా ఏం తెలుసుకుంటారు అంటే, భగవంతుడు అంటే పరిమితం కాదు, అపరిమితం అని.

జ్ఞానికి గురువు ద్వారా, భగవంతుడు అంటే పరిమితమైన రూపం కాదు, అపరిమితమైన శక్తిమంతుడు అని తెలుస్తుంది. అన్ని చోట్లా ఆయనే ఉన్నాడని, ఆయన లేని చోటు లేదని, ఆయన చైతన్యం లేనిదే ఈ భూమి మీద ఏదీ ఉండదని జ్ఞాని తెలుసుకుంటాడు.

సత్యం గురించి తెలుసుకోవడం అంటే, తన గురించి తాను తెలుసుకోవడమే అని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, తాను ఆత్మ స్వరూపం

అనే నమ్మకం మొదట ఉండదు. తర్వాత గురువు వచ్చి చెప్పినప్పుడు, సత్యం అంటే ఎప్పుడూ ఉండేది, అన్ని చోట్లా ఉండేది, అందరిలోనూ అణువుగా ఉండి, అన్ని జీవులను నడిపిస్తున్న ఆత్మ అని తెలుసుకుంటాడు. ఇవన్నీ మీరు ఎప్పుడైతే తెలుసుకుంటారో, అప్పుడు "ఓహో! అయితే నేను దేహం కాదన్నమాట, ఆత్మ వల్లే ఈ దేహం నడపబడుతుంది" అని అర్థం చేసుకుంటారు. ఇప్పటివరకు "నేను చేస్తున్నాను" అనే అహంకారపూరితమైన భావంతో ఉన్న మీరు, "నా చేత భగవంతుడు చేయిస్తున్నాడు" అనే సత్యాన్ని గుర్తిస్తారు.

నాలోనే కాదు, సమస్త జీవులలోనూ ఆత్మ స్వరూపమే అని మీరు తెలుసుకున్నప్పుడు, ఇక మీరు ఎవ్వరినీ విమర్శించరు. వాళ్ళు ఏం చేసినా క్షమా గుణంతో ఉంటారు. ఇప్పుడు చూడండి, మీ సొంత వాళ్ళు ఏం చేసినా మీరు సర్దుకుపోతారు. ఎందుకు? మీ బిడ్డలు అవనివ్వండి, లేకపోతే మీ బంధువులు అవనివ్వండి, వాళ్ళ విషయంలో కొంచెం సర్దుకుంటారు, మరీ అంత కోపం తెచ్చుకోరు. ఇలాగే అందరూ ఆత్మ స్వరూపులమే అని తెలుసుకున్నప్పుడు, మీలో క్షమాగుణం ఏర్పడుతుంది.

మొట్టమొదట "ఆత్మే దైవము" అని మీరు విశ్వసించినప్పుడు, తృప్తికరమైన జీవితాన్ని జీవిస్తారు. ఎవరైతే ఆత్మ తృప్తితో జీవించగలుగుతారో, వాళ్ళు స్వార్థం లేకుండా, నిస్వార్థంగా ఉంటారు. పూర్వం రోజుల్లో, అంటే అజ్ఞాన దశలో, ఉన్నపుడు "మీ పిల్లలకే ఉండాలి, మీ వాళ్ళకే ఉండాలి" అనే స్వార్థపూరితమైన భావంతో మీరు ఉంటారు. కానీ జ్ఞానికి "అందరితో కలిసి తినాలి" అనే భావం ఉంటుంది. "నా వాళ్ళకే ఉండాలి" అనేది స్వార్థ బుద్ధి, "అందరితో పంచుకుని తినాలి" అనేది నిస్వార్థ బుద్ధి. అజ్ఞానంలో "నా వాళ్ళకే

ఉండాలి" అని అనుకుంటారు, జ్ఞానం వచ్చిన తర్వాత ఏ జీవికి పెట్టినా, పరమాత్మకు పెట్టినట్టే అనే నిస్వార్థ బుద్ధితో ఉంటారు.

ఎప్పుడైతే మీరు నిస్వార్థంగా జీవించగలుగుతారో, అప్పుడు మీకు ఆత్మ తృప్తి ఉంటుంది. ఇప్పుడు చూడండి మీరు ఈ స్థాయికి వచ్చిన తర్వాత, మీరు తినకుండా మరొకరికి పెట్టినా హ్యాపీగా ఫీల్ అవుతారు. "పోన్లే, వాళ్ళకైనా పెట్టాము" అని సంతోషిస్తారు. ఎప్పుడూ కూడా దాచుకుని నేనే తినాలనే భావం ఉండదు.

ఈ స్థాయికి మీరు ఎదిగారంటే, అందుకు కారణం మీరు సత్యాన్ని తెలుసుకున్నారు, సత్యం అంటే ఏమిటో అర్థమైంది, ఆత్మ అంటే ఏమిటో తెలిసింది. మరి అందరూ ఆత్మ స్వరూపులమే అని తెలిసినప్పుడు, మీ పిల్లలకు మీరు భోజనం పెట్టినప్పుడు వాళ్ళు "బాగుందమ్మా" అని తృప్తిగా తిన్నప్పుడు మీరు ఎంత హ్యాపీగా ఫీల్ అవుతారు! అలా కొంచెం ఇచ్చినప్పుడే మీకు ఎంతో తృప్తి ఉంటే, మరి యోగులు జనాల కోసం సర్వం ధారపోస్తారు, వారికి ఎంత తృప్తి వుంటుంది?

ఇంకా గొప్పగా చెప్పుకోవాలంటే, దధీచి మహర్షి, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి వంటి మహనీయులను ఉదాహరణగా తీసుకోవచ్చు. దధీచి మహర్షి తన దేహాన్నే త్యాగం చేసి, తన ఎముకలను దేవతలకు ఇచ్చారు. శిబి చక్రవర్తి ఒక చిన్న పావురాన్ని కాపాడడం కోసం తన మాంసాన్నే ఇచ్చాడు. అలాగే బలి చక్రవర్తిని స్వయంగా భగవంతుడు అడిగినప్పుడు, "నా శరీరం ఏమైపోయినా నాకు పర్వాలేదు" అనే భావంతో తన శరీరాన్నే దానంగా ఇచ్చాడు. వీళ్ళ చరిత్రను చూస్తే, వీళ్ళు ఈ జ్ఞానాన్ని కేవలం వినడం కాదు, తెలుసుకోవడం మాత్రమే కాదు, ఆచరించి చూపించారు, మరి అంతటి యోగ

స్థితిలో వాళ్ళు ఉన్నారు.

మరి మీరు కొంచం కూడా ఇవ్వలేరా? వారు వాళ్ళ ప్రాణాలే పోతున్నాయని తెలిసినా, ఆ ప్రాణాలను పణంగా పెట్టి త్యాగం చేశారు. మరి ఇలాంటివి చూస్తున్నప్పుడు ఎందుకు ఇలా చేయగలిగారు అంటే, సాధనలోనే ఇది సాధ్యమవుతుంది. ఎప్పుడైతే సాధన ఉండదో, అప్పుడు "మీది" అన్నది పూచికపుల్ల కూడా ఎదుటి వాళ్ళకు ఇవ్వడానికి ఒప్పుకోరు.

దైవం మీద విశ్వాసం ఉంచిన వాడే మోక్షం పొందడానికి అర్హత కలిగి ఉంటాడు. అంటే ఎలాంటి విశ్వాసం ఉండాలి? "ఈ సృష్టి అంతా పరమాత్మదే, నా అదృష్టం కొద్దీ నాకు ఒక సద్గురువు వచ్చి ఈ సత్యాన్ని చెప్పారు, నేను నాది, మాది అనే భావం నాలో రానివ్వకుండా ఎప్పటికప్పుడు నన్ను నేను విచారణ చేసుకుంటూ ఉండాలనే విశ్వాసం ఉండాలి". ధనమైనా, జ్ఞానమైనా మీ నిస్వార్థమైన సేవకు, మీలో ఉన్న ప్యూరిటీకి ఇవ్వబడతాయి. ప్రకృతి మీరు నిస్వార్థంగా ఉన్నప్పుడు, ఏ స్వార్థ బుద్ధి లేనప్పుడు, మీ ప్రతి కర్మ యజ్ఞ కర్మగా మారినప్పుడు, మీకు ఎన్నో ఇవ్వబడతాయి.

మరి ఆత్మజ్ఞానం పొందడం అంటే అనేకత్వం నుంచి ఏకత్వంలోకి రావడం. అనేకత్వం అంటే అందరూ వేరు వేరు అని అనుకోవడం, ఏకత్వం అంటే అందరూ ఆత్మ స్వరూపులే అని తెలుసుకోవడం. అజ్ఞానంలో ఉంటే అందరూ వేరుగా కనిపిస్తారు. వీడు వేరు, వాడు వేరు అని, అవి జంతువులు, నేను మానవుడు అని దేహాలను బట్టి ఆలోచిస్తారు. కాని దేహాల గురించి ఉన్న ఆలోచనను తీసేస్తే అంతా ఒక్కటే, అంతా పరమాత్మ స్వరూపాలే.

ఆత్మ, పరమాత్మ ఇద్దరూ ఒకటే! కానీ పరమాత్మ మాయకు వశం కాకుండా, మాయను తన ఆధీనంలో ఉంచుకుంటాడు. మరి ఈ జీవులందరూ

మాయ ఆధీనంలో ఉండి అజ్ఞానంలో ఉన్నారు. ఎప్పుడైతే మీకు మాయ తొలగిపోతుందో! అప్పుడు భ్రాంతులన్నీ భ్రమలుగా మారిపోతాయి. ఆ భ్రమలన్నీ వీడిపోయినప్పుడు 'బ్రహ్మం' అంటే ఏమిటో తెలుస్తుంది. అందుకే మహాత్ములు **"బ్రహ్మను వీడితే బ్రహ్మమే అవుతావు"** అని అంటారు. అంటే, "నేను శరీరం" అనే భ్రమ, "నా మనసు", "నా బుద్ధి", "నా వాళ్ళు" అనే భ్రమ. ఈ భ్రమలన్నింటినీ మీరు వదిలితే, మీరే బ్రహ్మము అని తెలుసుకుంటారు.

మరి ఆత్మజ్ఞాని ఏది జరిగినా, ఎంతటి విపత్తు జరిగినా, మౌనంగా ఉండి సాక్షిగా ఉంటాడు తప్ప, ఎవ్వరినీ విమర్శించడు. "దైవం ఎందుకు ఇలా అన్యాయం చేసింది? నేను ఎంతో సాధన చేస్తున్నాను, నాకు ఇంకా కష్టాలు ఎందుకు వస్తున్నాయి?" అని చాలామంది అడుగుతూ ఉంటారు. మాకు రోగాలు వస్తున్నప్పుడు కూడా, "మేము చాలా రోజుల నుంచి ధ్యానం చేస్తున్నాం, మాకు ఇంకా ఈ రోగాలు ఎందుకు వస్తున్నాయి?" అని అడుగుతూ ఉంటారు.

మరి ఈ దుఃఖం ఎందుకు వస్తుంది? "నా భర్త పోయాడు, నా బిడ్డలు పోయారు" అని బాధపడుతూ ఉంటారు. ధ్యానం చేస్తే అవి జరగవు అని ఎప్పుడూ అనుకోకూడదు. ఏది ఎలా జరగాలో పరమాత్మకు ఎరుక ఉంది. జరగాల్సినవన్నీ భూమి మీద కరెక్ట్‌గానే జరిగిపోతున్నాయి, కానీ మీ అజ్ఞానమే విమర్శకు కారణం అవుతుంది.

ఇప్పుడు మీరు ధ్యానం చేస్తున్నారని మీ ఇంట్లో వాళ్ళు చావకుండా ఉంటారా? మీరు ధ్యానం చేస్తున్నారని మనిషికి చావు లేకుండా ఉంటుందా? జరగాల్సినవి ఏ నిర్ణయం తీసుకుని భూమి మీదకు వచ్చారో, ఆ నిర్ణయం

ప్రకారమే జరుగుతాయి. అంతేకానీ, "నేను ధ్యానం చేస్తున్నాను, నా భర్త పోయాడు, ఇలా ఎందుకు జరిగింది?" అంటే, పోకుండా ఉండరు కదా? "పుట్టినవాడు మరణించక తప్పదు. మరణించినవాడు పుట్టక తప్పదు". మరి గీతలో కూడా వుంది కదా? ఎవరి టైం వస్తే వాళ్ళు వెళ్తూ ఉంటారు.

అందుకే జరిగిన విషయాలను ధ్యానానికి ముడిపెట్టుకుని ధ్యానం మానేయకూడదు, ధ్యానం ఉంటే మీరు భగవంతుడి గురించి తెలుసుకుంటారు, కాని తెలుసుకోవడం అసంపూర్ణంగా ఉన్నప్పుడు మీ అభిప్రాయాలు ఇలాగే ఉంటాయి.

కొంత మందికి అహంకారం ఉంటుంది. ధ్యానం చేస్తూ నాలుగు క్లాసులు పెట్టినా, "నేను వినాల్సింది ఏమీ లేదు" అని అనుకుని, క్లాస్ సమయంలో కూడా బయట తిరుగుతూ ఉంటారు. మరి పూర్ణంగా వినకపోతే పూర్ణ జ్ఞానం ఎలా వస్తుంది? ఎంత ఎదిగినా, ఒదిగి ఉన్నవాడే 'జ్ఞాని'. అంటే, మీకు వినయం ఉన్నప్పుడే మీరు నేర్చుకోగలుగుతారు. పత్రి గారు మహా జ్ఞాని, ఆయన పోయే వరకు పుస్తకాలు చదువుతూనే ఉన్నారు.

మీరు కూడా గురువు బాటలో ఉండాలి అంటే, జ్ఞానపరంగా ఎదిగి అందరికీ చెప్పాలి. మీ మనసులోని అహంకారాన్ని వదిలించుకుని, ఒదిగి "నేను ఇంకా నేర్చుకోవాలి" అని స్వాధ్యాయం చేస్తూ ఉండాలి. మరి ఆత్మ జ్ఞాని ఎప్పుడూ సర్వ జీవులను ప్రేమిస్తాడు. ఆత్మజ్ఞానికి అంతటి విశ్వ ప్రేమ ఉంది కాబట్టే ప్రతి జీవిని ప్రేమిస్తాడు. బుద్ధుడిని తీసుకోండి, పత్రి గారిని తీసుకోండి, మరి శంకరాచార్యులను తీసుకోండి, ఎవరిని తీసుకున్నా వాళ్ళందరిదీ విశ్వప్రేమే. విశ్వ ప్రేమ ఉంది కాబట్టే ఈ లోకంలో దుఃఖానికి కారణం అజ్ఞానమే, కోరికలే అని తెలుసుకున్నారు.

అందరినీ జ్ఞానవంతులను చేస్తే ప్రతి ఒక్కరి దుఃఖం పోతుందని తెలుసుకుని, వాళ్ళందరూ అందరికీ జ్ఞానం పంచడానికి ప్రయత్నించారు. అందుచేత సత్యం చెప్పడానికి ఎప్పుడూ భయపడకూడదు. మీరు కత్తులు పట్టుకుని యుద్ధం చేయడం లేదు, సత్యాన్ని చెబుతున్నారు. ఈ యుద్ధంలో అపజయం ఎప్పుడూ ఉండదు, అవతలి వాడి దుఃఖాన్ని పోగొట్టడానికి మీరు చేస్తున్నారు, కానీ మీకేదో మెడల్స్ వస్తాయని చేయడం లేదు. భూమి మీదకు దిగి వచ్చిన భగవంతుడైన మీరు భగవంతుడిగా ప్రవర్తించాలి. ఈ భూమి మీదకు మీరు ఆత్మగా వచ్చారు, ఈ శరీరం అనే తొడుగులో ప్రవేశించారు. శరీరం లేకుండా ఆత్మ ఏదీ చేయలేదు, అందుకే ఆత్మ ఈ శరీరం అనే తొడుగును ధరిస్తుంది. తొడుగు ధరించి, ఈ ఇంద్రియాల ద్వారా విశ్వానికి ఏ మంచి చేయాలో ఆ మంచి చేస్తుంది.

మీరు పత్రి గారి లాంటి గురువును పొంది, సత్యాన్ని తెలుసుకుని, నిస్వార్థంగా బ్రతుకుతూ, ధైర్యంగా మాంసాహారం వద్దని చెప్పగలిగే ధైర్యం ఎప్పుడు వచ్చింది అంటే సత్యాన్ని సత్యంగా నమ్మినప్పుడు.

సత్యాన్ని తెలుసుకున్నవాడు చాలా ధైర్యంగా ఉంటాడు. “నాకు తెలిసిన సత్యాన్ని నేను చెప్పాను, ఆచరిస్తావా? ఆనందంగా ఉంటావు, ఆచరించకపోతే దుఃఖంలో కూరుకుపోతూ, జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటావు” అని చెబుతాడు. అందుకే ఒక ఆత్మ జ్ఞానికి భగవంతుడు అంటే నమ్మకం, విశ్వాసం, భక్తి ఉంటాయి. భగవంతుడిని కొలవడం అంటే పూజ చేయడం కాదు, ధ్యానం చేయడం. “నాకు జ్ఞానులే ఇష్టులు” అని భగవద్గీత ద్వారా భగవానుడే తెలియజేశాడు, కానీ అజ్ఞానంలో ఉన్నప్పుడు మీకు అది అర్థం కాదు.

ఆ ఒక్క శ్లోకం నన్ను చాలా మార్చింది, భగవంతుడికి ఇష్టం అవ్వాలి అంటే ధ్యానం చేయాల్సిందే. అందుకే ఏ ఒక్క రోజు ధ్యానం చేయకపోయినా, "నేను ఈరోజు భగవంతుడికి ఇష్టమైన పని చేయలేదు" అని అంతరాత్మ బాధపడుతుంది. మీరు శరీరం కోసం చాలా చేసుకుంటున్నారు, మరి ఆత్మను ఎందుకు విస్మరిస్తున్నారు?

"భగవంతుడు అంటే నాకు ఎంతో ఇష్టం" అని అనుకోవడం కాదు, ఆయనకు ఇష్టమైన పని ధ్యానం చేయడం అని తెలుసుకోవాలి. "ధ్యానులే ఆయనకు ఇష్టులు" అన్నప్పుడు, మీరు ఆ పని తప్పనిసరిగా చేయాలి. లేచిన వెంటనే ధ్యానం చేయాలి, పడుకునే ముందు కూడా ధ్యానం చేయాలి, అప్పుడు తృప్తిగా నిద్రపోతారు.

"అమ్మయ్యా! ఈరోజు నేను భగవంతుడికి నచ్చిన పని చేశాను" అని తృప్తి లోపల ఉంటుంది, అదే ఆత్మతృప్తి. తృప్తికరమైన జీవితాన్ని జీవిస్తేనే ఎప్పుడూ ఆనందంగా ఉంటారు. సత్యం తెలుసుకుని, సత్యంలో జీవించ లేకపోతే అసంతృప్తికరమైన జీవితం అవుతుంది.

అందుకే "భగవంతుడికి నచ్చిన ధ్యానం చేయకుండా మీరు ఒక్కరోజు కూడా ఉండకూడదు". అందుకే జ్ఞానికి భగవంతుడి మీద నమ్మకం, విశ్వాసం, ప్రేమ, శ్రద్ధ ఉండాలి. మామూలు ప్రేమ కాదు, అపరిమితమైన ప్రేమ ఉండాలి. ఆ ప్రేమ ఉన్నప్పుడే మీరు చాలా తృప్తికరమైన జీవితం, నిస్వార్థమైన జీవితం, త్యాగమయమైన జీవితం జీవిస్తారు.

"సర్వం భగవంతుడే" అని అనుకుంటే జ్ఞానులవుతారు. "నేను, నేను" అని అనుకుంటే మళ్లీ అజ్ఞానంలోకి దిగిపోతారు. అందుకే "నేను ఆత్మని, నేను ఆత్మని" అని గురువులు అనుకోమంటారు, భావించమంటారు,

అలా జీవించమంటారు. అలా జీవిస్తే ఎప్పుడూ తృప్తిగా, ఆనందంగా జీవిస్తారు.

అందుకే ఒక జ్ఞాని మాత్రమే భగవంతుడి మీద ఇష్టాన్ని పెంచుకుంటూ, తన ప్రవృత్తిని కూడా తనకు ఇష్టం వచ్చినట్టుగా మార్చుకుంటాడు. భగవంతుడి మీద ఇష్టం, ప్రేమ ఉంటే మీరు చాలా నిస్వార్థంగా జీవిస్తారు, క్షమా గుణంతో జీవిస్తారు, త్యాగ గుణంతో జీవిస్తారు. అందరితో పంచుకుంటూ, అందరితో మమేకమై, వసుధైక కుటుంబం ఎలా ఉంటుందో అలా జీవిస్తారు, ఈ భూమి అంతా ఒకే కుటుంబం అన్నట్టుగా జ్ఞాని జీవిస్తాడు. ఇవన్నీ తెలుసుకుంటూ ఆచరించినవాడే జ్ఞాని, ఆచరించకపోతే అజ్ఞానే.

తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

ఆధ్యాత్మిక ప్రగతి పొందాలంటే?

ధ్యాన మార్గంలోకి వచ్చిన మీరు ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అనే విషయాలను ఎన్నో తెలుసుకుంటున్నారు. ప్రతి విషయాన్ని లోతుగా తెలుసుకున్నప్పుడే అది నిజమైన జ్ఞానం అవుతుంది.

ఆత్మ దర్శనం కావాలంటే మీరు జ్ఞానాన్ని పెంచుకోవాలి, జ్ఞానాన్ని పెంచుకోవడం అంటే కేవలం విషయాలను తెలుసుకోవడం మాత్రమే కాదు. ఒక విషయం వల్ల కలిగే నష్టం ఏమిటి? దాని వల్ల కలిగే లాభం ఏమిటి? ఆ విషయం మీ జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అన్నది కూడా తెలుసుకోవాలి.

మీలో కొన్ని గుణాలు ఉంటాయి, ఇతరుల్లో కూడా కొన్ని గుణాలు కనిపిస్తాయి. ఆ గుణాలను చూసి వెంటనే "వీడికి ఇలా ఉంది, అలా ఉంది" అని తీర్పు చెప్పేస్తారు. కానీ ఆ వ్యక్తిలో ఆ గుణం ఎందుకు వచ్చింది? దాని వెనుక ఉన్న కారణం ఏమిటి? ఆ గుణం ఏర్పడటానికి ఏ పరిస్థితులు కారణమయ్యాయి? అని ఆలోచించరు.

కానీ మహాత్ములు, సత్పురుషులు, సద్గురువులు ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలిస్తారు. "వీడికి ఈ గుణం ఎందుకు వచ్చింది? ఈ గుణం వెనుక కారణం ఏమిటి?" అని విచారణ చేస్తారు. అలా కారణాన్ని తెలుసుకున్న తరువాత, ఆ విషయాన్ని శిష్యులకు బోధిస్తూ ఉంటారు. అందుకే సద్గురువు బోధన కేవలం ఒక వ్యక్తి గుణాన్ని తప్పుపట్టడం కాదు ఆ గుణం వెనుక ఉన్న మూల కారణాన్ని అర్థం చేసుకుని, దానిని ఎలా మార్చుకోవాలో చూపించడం. అందుకే ధ్యాన మార్గంలో మీరు కూడా ఇతరుల గుణాలను చూసి వెంటనే తీర్పు ఇవ్వకుండా, "ఈ గుణం ఎందుకు వచ్చింది? దీని వెనుక కారణం

ఏమిటి?" అని విచారణ చేయడం నేర్చుకోవాలి.

మరి ఆ విషయాలను శిష్యులు గ్రహించి, "ఇలాంటి గుణం నాకు ఉంది అంటే, నాలో ఇలాంటి లోపం కూడా ఉంది" అని తెలుసుకుని, తమలో ఉన్న లోపాలను సరిచేసుకుంటారు. మరి అలాంటి విషయాలు ఈరోజు మరికొన్ని తెలుసుకుందాం.

1) సహనం మంచి వారి దగ్గర ఉంటుంది.

2) కోపం ఆవేశపరుల దగ్గర ఉంటుంది.

3) ప్రేమ మంచి మనసున్న వారి దగ్గర ఉంటుంది.

4) గర్వం, అసూయా పరుల దగ్గర ఉంటుంది.

5) జ్ఞానం భగవంతుని నమ్మే వారి దగ్గర ఉంటుంది.

ఈ ఐదు పాయింట్లను మీరు గుర్తుంచుకుంటే, "ఇవన్నీ నాకు ఎందుకు వస్తున్నాయి? నా దగ్గర ఈ గుణం ఎందుకు ఉంది?" అని మీలో మీరు విచారణ చేసుకుంటూ తెలుసుకోవచ్చు.

1) సహనం మంచి వారి దగ్గర ఉంటుంది.

పత్రి గారు మనకు "సహనమే ప్రగతి" అని చెప్పారు. ఎవరైనా ఏదైనా మాట్లాడినప్పుడు మీకు వెంటనే ఆవేశం వస్తూ ఉంటుంది, వెంటనే కోపానికి గురవుతారు. అలా ఆవేశపడినప్పుడు మీరు మీలో ఉన్న శక్తిని కోల్పోతూ ఉంటారు. మీరు ఎన్నో సార్లు చెప్పుకున్నారు మాట వల్ల కూడా శక్తిని కోల్పోతారు అని. కేవలం మాట వల్లే శక్తి పోతుంటే, దానికి తోడు మనసులో ఆవేశం, కోపం పెంచుకుంటే ఇంకా ఎక్కువ శక్తిని వ్యర్థం చేసుకుంటారు, అలా మీరు మీ శక్తిని మరింత కోల్పోతారు. అందుకే సహనం ఉంటేనే మీరు ప్రగతిని సాధించగలరు అని తెలుసుకోవాలి.

మీ అందరి లక్ష్యం ఒక్కటే ఈ జన్మలో సంపూర్ణమైన జ్ఞానాన్ని పొందాలని, అలాంటి గొప్ప లక్ష్యాన్ని పెట్టుకున్నప్పుడు, అవతలి వారికి మీ గురించి పూర్తిగా తెలియకపోవచ్చు, వారు మీ పరిస్థితులను, మీ ఆలోచనలను, మీ సాధనను అర్థం చేసుకోకపోవచ్చు. అందుకే వారు తమకు ఇష్టం వచ్చినట్లు ఏదైనా మాట్లాడవచ్చు, అప్పుడు మీరు వారి మాటలకు వెంటనే స్పందించి ఆవేశపడాల్సిన అవసరం లేదు. వారు ఏం మాట్లాడినా, మీ లక్ష్యం ఏమిటో మీరు గుర్తుంచుకోవాలి. మీ లక్ష్యం సంపూర్ణ జ్ఞానం పొందడం అయితే, మీ శక్తిని కోపానికి, ఆవేశానికి ఖర్చు చేయకుండా సహనంతో ఉండడం నేర్చుకోవాలి, ఎందుకంటే మీ సాధనలో మీ శక్తి ఎంతో విలువైనది. ఇతరులు మాట్లాడిన మాటలకు మీరు ఆవేశపడుతూ ఆ శక్తిని కోల్పోతే, మీ ఆధ్యాత్మిక ప్రగతికి మీరే అడ్డంకిగా మారుతారు. అందుకే సహనం అనేది కేవలం ఒక మంచి గుణమే కాదు, ఆధ్యాత్మిక ప్రగతికి అవసరమైన గొప్ప విషయం.

చూడండి 2013లో టీవీ9 వారు పత్రి గారిని ఎంతో విమర్శించారు. కానీ ఆ సమయంలో పత్రి గారు ఎంతో సహనాన్ని ప్రదర్శించారు. టీవీ9 మీద ఒక్క బ్యాడ్ స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. ఎందుకంటే, ఒక జ్ఞానిని ఆధ్యాత్మికంగా ఎదగని వారు, మూర్ఖత్వంలో ఉన్నవారు మాత్రమే విమర్శిస్తారు. కాబట్టి ఎప్పుడైతే ఒక జ్ఞానిని ఎవరైనా విమర్శిస్తారో, నిందిస్తారో, అప్పుడు “అతను ఆధ్యాత్మికంగా మూర్ఖుడు అని భావించి సహనంతో ఉండాలి. వెంటనే స్పందించి, కోపంతో మాట్లాడి, వాదనకు దిగాల్సిన అవసరం లేదు.

బుద్ధుడు కూడా “మూర్ఖులతో వాదించే పొరపాటు ఎప్పుడూ చేయొద్దు” అని చెబుతాడు. ఒక వ్యక్తి అజ్ఞానంలో ఉన్నాడని తెలిసినప్పుడు, అతనికి జ్ఞానాన్ని అందించి మార్చే అవకాశం ఉంటుంది కానీ మూర్ఖత్వంతో,

మొండితనంతో ఉన్న వ్యక్తిని మీరు మార్చలేరు. అందుకే బుద్ధుడు చెప్పిన బ్రహ్మ విహారాల్లో "ఉపేక్ష" అనే గుణం కూడా ఎంతో ముఖ్యమైనది. అందుచేత మూర్ఖుల పట్ల ఉపేక్ష వహించాలి. అంటే, "వాడు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాడో అర్థం చేసుకొని వాడితో వాదించడం వల్ల ప్రయోజనం లేదు" అని తెలుసుకుని వదిలివేయాలి.

పత్రి గారు కూడా తన జీవితంలో ఇదే విషయాన్ని ఆచరించి, మనకు ఆదర్శ మూర్తిగా నిలిచారు. గురువు ఏం చేస్తున్నారో మీరు ఎప్పుడూ గమనిస్తూ ఉంటే, ఆయన జీవితం ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చు. ఆయన చెప్పిన మాటలను మాత్రమే కాకుండా, ఆయన ఆచరించిన విధానాన్ని కూడా మీరు గ్రహించాలి. ఆ విషయాలను మీరు మీ జీవితంలో ఆచరించి, గురువు చూపిన మార్గంలో జీవించినప్పుడు, మీరు కూడా ఆధ్యాత్మికంగా పురోగతి సాధించగలరు. మరి "సహనం మంచి వారి దగ్గర ఉంటుంది" అని ఎందుకు అన్నారు అంటే? మంచి వ్యక్తి చిటికీ మాటికి ఇతరులను విమర్శించేవాడు కాదు, చిన్న విషయానికే తిట్టేవాడు కాదు, ప్రతి మాటకు వెంటనే స్పందించేవాడు కాదు.

నిజమైన జ్ఞాని ఎప్పుడూ సహనంతో ఉంటాడు. ఎవరైనా విమర్శించినా, ఎవరైనా తిట్టినా, ఎవరైనా నిందించినా, అతను తన అంతరంగ శాంతిని కోల్పోడు. ఎందుకంటే అతనికి ఒక స్పష్టమైన అవగాహన ఉంటుంది "వారు విమర్శిస్తున్నది నా దేహాన్ని ఆత్మ అయిన నన్ను విమర్శించలేరు కదా?" అని.

అందుకే సహనం మంచి వారి దగ్గర ఉంటుంది. ఈ లోకంలో మంచి వారు ఎవరయ్యా అంటే, నిజమైన జ్ఞానవంతులే, జ్ఞానాన్ని పొందిన

వాడే. జ్ఞానాన్ని పొందుతూ, ఆ జ్ఞానాన్ని తన జీవితంలో ఆచరించేవాడే నిజమైన మంచి వ్యక్తి. ఎందుకంటే అందరిలోనూ ఉన్న దైవత్వాన్ని చూడగలిగినవాడు జ్ఞాని ఒక్కడే. "అందరూ ఆత్మ స్వరూపులే" అనే సత్యాన్ని తెలుసుకోవడమే కాదు, దాన్ని అనుభవంలోకి తెచ్చుకున్న వాడే నిజమైన జ్ఞాని. ఈ జ్ఞానం ఉన్నవాడే ఈ లోకంలో అందరితో మంచిగా వ్యవహరించగలడు. అద్వైత భావంలో జీవించేవాడు ప్రతి ఒక్కరిలోనూ ఒకే ఆత్మ తత్వాన్ని చూడగలడు. అందరినీ సమానంగా చూడగలిగిన వాడే జ్ఞాని. అతనికి ఎవరి మీదా ద్వేషం ఉండదు, ఎవరి మీదా అనవసరమైన కోపం ఉండదు. ఎందుకంటే అందరిలో ఉన్నది ఒకే దైవత్వం అని అతనికి తెలుసు.

అందుకే ఒక జ్ఞానిని ఎవరైనా విమర్శించినప్పుడు, వారి మాటలకు స్పందించడు. "ఇతనికి ఇంకా సత్యం అర్థం కాలేదు, అందరిలోని దైవత్వాన్ని చూడలేకపోతున్నాడు" అని భావిస్తాడు, ఈ "అవగాహన లేకపోవడం వల్లే అతను విమర్శిస్తున్నాడు, కాబట్టి అతనితో వాదించకుండా, సహనంతో ఉండడం మంచిది అని భావిస్తాడు".

మరి ఎవరైనా మిమ్మల్ని విమర్శించినప్పుడు కూడా మీరు సహనాన్ని ప్రదర్శించ గలిగితే, అదే మీలో జ్ఞానం పెరుగుతుందనడానికి ఒక సూచన. ఎందుకంటే? విమర్శించినవాడు శత్రువు కాదు, పొగిడినవాడు మిత్రుడు కాదు అనే స్థితికి జ్ఞాని చేరుకుంటాడు. ఎవరు విమర్శించినా అతను తన స్థితిని కోల్పోడు, ఎవరు పొగిడినా అతను గర్వపడడు. అందుకే "సహనం మంచి వారి దగ్గర ఉంటుంది" అని చెప్పారు. జ్ఞానం ఉన్న చోట సహనం ఉంటుంది, జ్ఞానం పెరిగిన కొద్దీ సహనం పెరుగుతుంది, సహనం పెరిగిన కొద్దీ మనస్సు స్థిరపడుతుంది, మనస్సు స్థిరపడిన కొద్దీ మీరు ఆత్మ విచారణలో ముందుకు

వెళ్ళగలరు.

అందుకే పత్రి గారు మనకు “సహనమే ప్రగతి” అని చెప్పారు, అంటే మీరు ప్రగతి సాధించాలి అంటే, మీరు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలి. అంటే, మీలో సహనం తప్పనిసరిగా ఉండాలి, శారీరకంగా, మానసికంగా, బుద్ధి పరంగా మీరు సహనాన్ని ప్రదర్శించగలిగినప్పుడే మీలో ఉన్న మార్పు మీకు స్పష్టంగా తెలుస్తుంది. ప్రతి పరిస్థితిలోనూ వెంటనే స్పందించకుండా, ఆలోచించి స్పందించడం నేర్చుకున్నప్పుడు మీరు శక్తివంతులు అవుతారు.

మీరు సహనాన్ని ఎంతగా అభ్యసిస్తారో, అంతగా మీలో కోపం, ఆవేశం తగ్గుతాయి. మీ మనస్సు ప్రశాంతంగా మారుతుంది, మీ ఆలోచనా శక్తి పెరుగుతుంది. అలా మీరు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతూ, నిజమైన ప్రగతిని సాధించగలరు.

అందుకే జ్ఞాన మార్గంలో నడిచే వారికి మొట్టమొదట ఉండాల్సిన గుణం సహనం. మొదటగా మీరు గురువు దగ్గర సహనాన్ని ప్రదర్శించాలి. గురువు మీకు ఎన్నో పరీక్షలు పెడుతూ ఉంటారు, కొన్ని సందర్భాల్లో మీరు అర్థం చేసుకోలేని పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయినా మీరు సహనాన్ని కోల్పోకూడదు, గురువు పెట్టే ప్రతి పరీక్ష వెనుక ఒక ఉద్దేశం ఉంటుంది. ఆ పరీక్షల ద్వారా మీలోని లోపాలను తొలగించి, మిమ్మల్ని ఆత్మజ్ఞానానికి సిద్ధం చేస్తారు.

మిలారేపా చరిత్రను మీరు ఒకసారి చదివితే ఈ విషయం మీకు స్పష్టంగా అర్థమవుతుంది. గురువు ఎందుకు అన్ని పరీక్షలు పెట్టారు? ఎందుకు అంత కష్టపెట్టారు? అనే ప్రశ్న వస్తుంది. ఒక సందర్భంలో గురువు భార్య

కూడా, “ఎందుకు ఆ చిన్న పిల్లవాడిని అంత కష్టపెడుతున్నారు?” అని అడుగుతుంది.

కానీ గురువు ఉద్దేశం మిలారేపాను కష్టపెట్టడం కాదు. ఆత్మవిద్య వంటి ఉన్నతమైన విద్యను పొందాలంటే శిష్యుడిలో సహనం ఉండాలి, పరీక్షలను తట్టుకునే శక్తి ఉండాలి. గురువు చెప్పిన మార్గంలో ఓర్పుతో ముందుకు సాగగలిగినప్పుడే ఆ విద్య శిష్యుడిలో వంటపడుతుంది. అందుకే మిలారెపాను ఎన్నో పరీక్షలకు గురిచేశారు.

పూర్వకాలంలో ఆత్మవిద్య, తెలుసుకోవాలంటే శిష్యుడు గురువు దగ్గర ఎన్నో సంవత్సరాలు ఉండేవాడు. గురువు పెట్టే పరీక్షలను తట్టుకుంటూ, ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ, సహనంతో సాధన చేస్తూ ఆ విద్యను నేర్చుకునేవారు. వారికి ఆ విద్య విలువ తెలుసు, ఆ జ్ఞానం కోసం ఎంత కష్టపడాలో వారికి తెలుసు.

కానీ ఈ రోజుల్లో చాలామంది ఆత్మవిద్య, అంగట్లో దొరికే సరుకులా భావిస్తున్నారు. “ఎక్కడైనా వెళ్ళి వింటే చాలు, ఎవరో చెబితే చాలు, వెంటనే జ్ఞానం వచ్చేస్తుంది” అని అనుకుంటున్నారు. కానీ ఆత్మజ్ఞానం అలా సులభంగా మీ సొంతం కాదు. వినడం వల్ల విషయం తెలుస్తుంది, సాధన చేయడం వల్ల అనుభవంలోకి వస్తుంది. ఆత్మవిద్యను నిజంగా జీవితంలోకి రావాలంటే క్రమశిక్షణ, సహనం, నిరంతర సాధన, జ్ఞానం పొందాలనే తపన అవసరం. ఎవరైతే నిజంగా సాధన చేసి జ్ఞానాన్ని పొందాలనే తపనతో ఉంటారో, వారికి మాత్రమే ఈ విషయం అర్థమవుతుంది. వారు ఎదురయ్యే ప్రతి పరీక్షను ఒక అడ్డంకిగా కాకుండా, తమ ఎదుగుదలకు ఒక అవకాశంగా చూస్తారు.

అందుకే జ్ఞానులు జ్ఞానం పొందాలి అనుకున్నప్పుడు సాధకులు

ఎంతో సహనం వహించాలి. మీరు మంచి వారిగా భగవంతుడి దృష్టిలో ఉండాలి అంటే, మీకు సహనం అనే గుణం మొట్టమొదట ఉండాలి.

2) కోపం ఆవేశపరుల దగ్గర ఉంటుంది :

సహనం లేనప్పుడు ఆవేశం వస్తుంది. ఎవరైనా ఒక్క మాట అన్నా, అది పొరపాటున అన్న మాట అయినా సరే, కొందరికి వెంటనే కోపం వచ్చేస్తుంది. **"యోగుల కోపం లోక కళ్యాణం కోసం, భోగుల కోపం లోక వినాశనం కోసం"** అని అంటారు.

ఇప్పుడు దుర్వాస మహా మునికి కానీ, విశ్వామిత్రుడికి కానీ కోపం చాలా ఎక్కువగా ఉండేదని మనకు తెలుసు. ముఖ్యంగా దుర్వాస మహా మునికి కోపం ఎక్కువ అని చెబుతారు. అయితే అది సాధారణమైన కోపం కాదు, అది యోగుల కోపం, లోక కళ్యాణార్థం వ్యక్తమయ్యే కోపం. కొన్ని ప్రత్యేకమైన కారణాల వల్ల వారు భూమి పైకి వస్తారు. వారి ద్వారా కొన్ని కార్యాలు జరగాల్సి ఉంటుంది, అందులో భాగంగానే వారికి అలాంటి గుణాలు కూడా కనిపిస్తాయి.

మరి ఆ విధంగా మీకు ఒక చిన్న ఉదాహరణగా దుర్వాస మహాముని కోపం ఎలా లోక కళ్యాణానికి కారణమైందో చూద్దాం. మహాభారత యుద్ధం జరుగుతున్న సమయంలో ఒకరోజు కృష్ణుడు దుర్వాస మహాముని దగ్గరకు వచ్చి, "నువ్వు ఈరోజు పాండవులను రక్షించాలి, ఆ బాధ్యత నీదే" అని చెప్పాడట. అప్పుడు దుర్వాస మహాముని, "నా చేత నువ్వు ఏదైనా అబద్ధం ఆడిస్తే దాని వల్ల నాకు కర్మ వస్తుంది, కాబట్టి నేను చేయను" అని అన్నాడట. అప్పుడు కృష్ణుడు, "కాదు, ఈ పని నీ వల్లే జరగాలి, నీకు ఎలాంటి కర్మ అంటుకోకుండా చూసుకునే బాధ్యత నాది, అందుకే అలాంటి పనినే నీకు

అప్పగిస్తాను" అని చెప్పడంతో దుర్వాస మహా ముని ఆ పనికి ఒప్పుకున్నాడట.

మరి ఆయన ఒప్పుకున్న తరువాత కృష్ణుడు ఏం చేశాడంటే, ఒక పెద్ద గొయ్యి తవ్వించి, అందులో పాండవులను కూర్చోబెట్టి, పైన రాతి పలకలు వేసి, దాని మీద ఒక కుర్చీ వేసి దుర్వాస మహామునిని కూర్చోబెట్టాడట.

ఆ సమయంలో సైంధవుడికి ఒకరోజు పాండవులను జయించే శక్తి ఉందని నేను ఎక్కడో చదివాను. మరి దుర్వాస మహాముని అలా కూర్చున్నప్పుడు, అటు వైపు నుంచి వచ్చిన వాళ్లు, ఇటువైపు నుంచి వచ్చిన వాళ్ళు ఆయనను అడుగుతున్నారట "పాండవులను చూశారా? చూశారా?" అని.

అప్పుడు ఆయన, "ఆ, చూశాను" అని చెప్పేవాడట. "మరి ఎక్కడ చూశారు?" అని అడిగితే, "ఒక గోతిలో" అని సమాధానం చెప్పేవాడట.

ఇంతకంటే ఎక్కువ ప్రశ్నలు అడిగితే ఆయన కోపంతో శపిస్తాడేమో అని భయపడి, వారు అక్కడితో ఆపేసి వెళ్ళిపోయేవారట. అలా ఎక్కువగా ప్రశ్నించకుండా వెళ్ళిపోవడం వల్ల పాండవులు కూడా రక్షించబడ్డారట. ఆ రోజు దుర్వాస మహా ముని కోప స్వభావమే పాండవులను రక్షించడానికి ఒక కారణంగా మారింది. అందుకే "యోగుల కోపం లోక కళ్యాణం, భోగుల కోపం లోక వినాశనం" అని అంటారు.

లోకంలో కొంతమంది చాలా కోపిష్టులుగా ఉంటారు. చిన్న విషయం జరిగినా వెంటనే ఆవేశపడిపోతారు. ఎదుటి వాడు ఎందుకు అలా మాట్లాడాడు? అతను నిజంగా ఏ ఉద్దేశంతో అన్నాడు? అనే ఆలోచన కూడా చేయకుండా వెంటనే కోపానికి గురవుతారు. కొంత మందిలో ఈ స్వభావం చిన్నప్పటి నుంచే ఏర్పడి ఉండవచ్చు. తల్లిదండ్రుల గారాబం వల్ల కావచ్చు, పెరిగిన

పరిసరాల ప్రభావం వల్ల కావచ్చు, లేదా చిన్న విషయాలకు కూడా ఎక్కువగా స్పందించే అలవాటు వల్ల కావచ్చు, అలా కొంత మందికి చిన్న విషయానికే కోపం ఎక్కువగా వస్తూ ఉంటుంది.

అందుకే మన పెద్దలు చాలా గొప్పగా చెప్పారు "తన కోపమే తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ" అని. మీ కోపం వల్ల మీరు ఎంతో శక్తిని కోల్పోతారు, ఆవేశంలో మాట్లాడిన మాటలు తిరిగి తీసుకోలేరు. ఆవేశంలో చేసిన పనులు తరువాత బాధను కలిగించవచ్చు. అంతేకాదు, కోపం మీ శారీరక, మానసిక శక్తిని కూడా తగ్గిస్తుంది.

అందుకే సహనం ఉన్నవాడు గొప్పవాడవుతాడు. కోపిష్టి వ్యక్తికి కొంత నష్టం శారీరకంగా కూడా జరుగుతుంది, ముఖ్యంగా అతను తనలోని విలువైన శక్తిని కోల్పోతూ ఉంటాడు. అందుకే "ఆవేశపరులకు కోపం ఎక్కువగా ఉంటుంది" అని అంటారు. మీకు కోపం వచ్చినప్పుడు, "నేను ఎందుకు ఆవేశపడుతున్నాను? నాకు ఎందుకు శాంతి ఉండటం లేదు? నేను ఎందుకు ప్రశాంతంగా ఉండలేకపోతున్నాను?" అని మీకు మీరు ప్రశ్నించుకోవాలి, ఇదే ఆత్మ విచారణ.

కోపం వచ్చిన ప్రతిసారీ ఎదుటివారిని తప్పుపట్టడం కాకుండా, "నా లోపల ఈ కోపం ఎందుకు వచ్చింది?" అని విచారణ చేసుకున్నప్పుడు మాత్రమే మీలో మార్పు మొదలవుతుంది. సహనాన్ని అభ్యసిస్తూ, ప్రతి పరిస్థితిలో శాంతిని కాపాడుకుంటూ ముందుకు సాగినప్పుడు, మీ సాధనలో నిజమైన ప్రగతి ప్రారంభమవుతుంది.

3) ప్రేమ మంచి మనసున్నవారి దగ్గర ఉంటుంది

"ప్రేమ మంచి మనసున్న వారి దగ్గర ఉంటుంది" అని ఎందుకు

అంటారు? సత్యాన్ని తెలుసుకుని, తెలుసుకున్న విషయాన్ని ఆచరణలో పెట్టుకున్న వారే నిజమైన మంచి మనసున్న వారు. మనసును స్వాధీనం చేసుకుని, దాన్ని పరమాత్మ వైపు తిప్పి, తాము ఆత్మస్వరూపులమనే ఎరుకతో జీవించేవారు అందరినీ ప్రేమిస్తారు.

ఇప్పుడు మీరు సద్గురువులను తీసుకున్నా, పత్రి గారిని తీసుకున్నా, రాఘవరావు గారిని తీసుకున్నా వారు అందరినీ ప్రేమిస్తారు. సృష్టిలోని సర్వ జీవుల పట్ల ప్రేమను కలిగి ఉంటారు. శంకరాచార్యులు, మలయాళ స్వామి వంటి మహాత్ముల జీవిత చరిత్రలను మీరు పరిశీలిస్తే, వారు తమ జీవితాలను త్యాగం చేసి, అందరి పట్ల ప్రేమతో "సర్వ జీవుల ప్రేమే సర్వేశ్వర ప్రేమ" అనే సత్యాన్ని వారు తెలుసుకున్నారు. అందుకే సర్వ జీవులను ప్రేమించాలి అని బోధించారు.

ఇప్పుడు కొంతమంది మాంసాహారం తీసుకుంటున్నారు. వారు అజ్ఞానం వల్ల, తెలియక అలా చేస్తున్నారు. మనిషికి భగవంతుడు ఇచ్చిన బుద్ధి, వివేకాన్ని ఉపయోగించి మంచిగా వ్యవహరించాలి, కానీ కొన్నిసార్లు అజ్ఞానం వల్ల తప్పు మార్గంలోకి వెళ్ళిపోతున్నారు. "మేము ఆ కులంలో పుట్టాం కాబట్టి మేము తినాలి" అనే ఒక భావంలో ఉండి అలా చేస్తున్నారు. కానీ సృష్టిలోని ప్రతి జీవి కూడా ఆత్మ పరిణామ క్రమంలో ఒక రూపాన్ని ధరించి, తనకు సంబంధించిన అనుభవాలను పొందుతూ, నేర్చుకోవాల్సిన పాఠాలను నేర్చుకుంటూ ముందుకు సాగుతుందని వారికి తెలియదు. మరి తెలియని వారికి తెలియజేయడం కూడా జ్ఞాని యొక్క లక్షణమే. ఎందుకంటే జ్ఞాని మనసులో "అందరూ ఆత్మ స్వరూపులే" అనే భావం స్థిరంగా ఉంటుంది. మాయను దాటే కొద్దీ ఆ భావం మరింత బలపడుతుంది, అందుకే వారిని

మంచి మనసున్న వారు అని అంటారు.

మంచి మనసు అంటే కేవలం ఇతరులకు సహాయం చేయడం మాత్రమే కాదు “అందరూ ఆత్మ స్వరూపులే” అనే ఎరుకలో ఉండటమే నిజమైన మంచి మనసుకు పునాది. “నేను వేరు, వాళ్ళు వేరు” అంటూ ప్రతి దానిలో భేదాన్ని మాత్రమే చూస్తూ ఉంటే, మీ మనసు ఇంకా పూర్తిగా శుద్ధి కాలేదని అర్థం.

గురువు చెప్పిన ధ్యానంలో శిక్షణ పొందిన శిష్యుడు కూడా ఇదే విధంగా వ్యవహరించడం నేర్చుకుంటాడు. అతని మనసులో కరుణ పెరుగుతుంది, జీవులను ప్రేమించాలి, మానవులను ప్రేమించాలి, అజ్ఞానంలో ఉన్నవారికి జ్ఞానాన్ని అందించాలి అనే భావం కలుగుతుంది. ఒక మనిషి అజ్ఞానం వల్ల తప్పు చేస్తున్నప్పుడు, అతన్ని ద్వేషించడం జ్ఞానం కాదు. అతని అజ్ఞానాన్ని తొలగించడానికి ప్రయత్నించడం జ్ఞాని యొక్క లక్షణం. అలాగే సర్వ జీవులు కూడా ఆత్మ పరిణామ క్రమంలో తమ తమ అనుభవాలను పొందుతూ ముందుకు సాగుతున్నాయని తెలుసుకోవాలి.

ఈ సత్యాన్ని తెలుసుకున్న జ్ఞాని “సర్వ జీవులు సమానమే” అనే భావనతో జీవిస్తాడు. ఏ జీవికీ హాని చేయకూడదు, జీవులను ప్రేమించినప్పుడు వాటిని సంహరించాలనే భావం మీలో ఉండదు. ప్రేమ లేనప్పుడు మాత్రమే జీవిని ఒక వస్తువుగా చూసి, దాని బాధను పట్టించుకోకుండా వ్యవహరిస్తారు.

అందుకే గురువు దగ్గర జ్ఞానాన్ని పొందిన శిష్యుడి మనసు క్రమంగా ప్రేమమయంగా మారుతుంది. ఎందుకంటే అతనికి ‘‘అందరూ ఆత్మ స్వరూపులే’’ అని అర్థమవుతుంది. జీవిని హింసించడం తప్పు అని తెలుసుకుంటాడు. ఇతరుల అజ్ఞానాన్ని కూడా ద్వేషించకుండా, వారికి జ్ఞానం

అందించడానికి ప్రయత్నిస్తాడు.

అందుకే అందరినీ మార్చడానికి మీ చేతనైనంత ప్రయత్నం చేయాలి. “నా వల్ల ఏమవుతుంది?” అని ఆలోచించి వెనక్కి తగ్గకూడదు, ప్రయత్నం చేయడానికి సిద్ధంగా ఉండాలి. మీకు తెలిసిన మంచి విషయాన్ని మరొకరికి తెలియజేయాలనే తపన ఉండాలి. అందరికీ ధ్యానం నేర్పాలి, అందరూ సాత్త్వికమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి, జీవుల పట్ల కరుణతో ఉండాలి అనే భావం మీలో ఎప్పుడు కలుగుతుంది? మీరు సర్వ జీవులను నిజంగా ప్రేమించినప్పుడే.

“అందరికీ ధ్యానం నేర్పాలి, అందరికీ జ్ఞానం అందించాలి” అనే భావం మీలో ఎప్పుడు వస్తుంది? మీ మనసు శుద్ధి అయినప్పుడు వస్తుంది. శుద్ధ మనసు అంటే “నాది, నేను” అనే స్వార్థ భావనను వదిలిన మనసు, “సర్వ జీవులు సర్వేశ్వరుడి నుంచే భూమి పైకి వచ్చిన ఆత్మ స్వరూపాలు, రూపాలు వేరైనా, అందరిలో ఉన్న ఆత్మతత్వం ఒక్కటే! అందరూ భగవత్ స్వరూపులే” అనే సత్యాన్ని మీరు గ్రహించినప్పుడు మీ మనసు ప్రేమమయంగా మారుతుంది.

మనసు ప్రేమమయంగా మారినప్పుడు మీరు అందరినీ ప్రేమించగలుగుతారు. అందరినీ ప్రేమించినప్పుడు మీలో కరుణ పెరుగుతుంది, కరుణ పెరిగినప్పుడు ఇతరుల ఉన్నతికి మీరు కూడా ప్రయత్నిస్తారు. అందుకే ముందుగా జ్ఞానం రావాలి, ఆ జ్ఞానం పెరిగే కొద్దీ ప్రేమ పెరుగుతుంది, ప్రేమ పెరిగే కొద్దీ మనసు శుద్ధి అవుతుంది, మనసు శుద్ధి అయిన కొద్దీ మీరు అందరిలోనూ ఒకే ఆత్మ తత్వాన్ని చూడగలుగుతారు.

4) గర్వం అసూయాపరుల వద్ద ఉంటుంది:

"గర్వం అసూయాపరుల దగ్గర ఉంటుంది" అన్నారు. అంటే ఎవరిని చూసినా, "నేనే గొప్ప, వాళ్ళేమి గొప్ప?" అనే భావం అసూయ కలగడం. ఎదుటివారు ఎంత గొప్పవాళ్లైనా, వారిలో ఏదైనా చిన్న లోపం కనిపిస్తే దాన్ని వెతికి వెతికి బయటకు తీసి, "వాళ్ళకంటే నేనే గొప్ప" అనే గర్వాన్ని పెంచుకోవడం.

మరి మనసులో అసూయ ఎప్పుడు పుడుతుంది? "నేను గొప్పవాడిని, నన్ను దాటి వీళ్ళుముందుకు వెళ్ళిపోతారేమో? ఇప్పటివరకు నన్ను పొగిడిన వారంతా రేపటి నుంచి వీరిని పొగుడుతారేమో?" అనే భావం లోపల ఉన్నప్పుడు అసూయ పుడుతుంది.

ఎదుటి వాడు ఎదుగుతున్నప్పుడు, అతని గొప్పతనాన్ని చూసి సంతోషించాల్సింది పోయి, అతనిలో ఉన్న లోపాలను పదే పదే అందరి దగ్గర చెప్పడం ప్రారంభిస్తారు. ఎందుకు? మీలో ఎక్కడో దాగి ఉన్న అసూయ కారణంగా "వాడు నన్ను దాటి ముందుకు వెళ్ళిపోతాడేమో, ప్రజలు నన్ను కాకుండా వాడిని పొగుడుతారేమో" అనే భయం ఉన్నప్పుడే ఎదుటి వాడి గొప్పతనాన్ని మీరు అంగీకరించలేరు.

మీలో గర్వం, అహంకారం లేకపోతే ఎదుటి వారిలో ఒక్క శాతం మంచి ఉన్నా కూడా దాన్ని మీరు గుర్తిస్తారు. "నువ్వు ఈ పని చాలా బాగా చేశావు" అని మనస్ఫూర్తిగా అభినందిస్తారు. ఎదుటి వాడు ఎదిగితే మీరు కూడా కూడా సంతోషిస్తారు. కానీ మీలో అసూయ ఉన్నప్పుడు, ఎదుటి వాడు ఎంత గొప్ప పని చేసినా దాన్ని గొప్పగా చూడలేరు. అతని మంచి కనిపించదు, అతని లోపాలే కనిపిస్తాయి, అతని గొప్పతనాన్ని అంగీకరించలేరు.. అందుకే మీకు మీరు విచారణ చేసుకోవాలి "నాకు ఎందుకు అసూయ వస్తోంది?

ఎదుటి వాడు ఎదిగితే నాకు ఎందుకు బాధ కలుగుతోంది? వాడిని నేను ఎందుకు అభినందించ లేకపోతున్నాను?" అని.

ఈ విధంగా మీలో మీరు విచారణ చేసుకున్నప్పుడు, మీలో ఎక్కడో దాగి ఉన్న గర్వం, అహంకారం అర్థమవుతాయి. ఆ లోపాలను గుర్తించి సరిచేసుకున్నప్పుడే మీరు నిజమైన ఆధ్యాత్మిక ప్రగతిని సాధించగలరు.

సృష్టిలో ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక గొప్పతనం ఉంటుంది. ఎవరిలో ఏ మంచి గుణం ఉందో దాన్ని చూసి మీరు నేర్చుకోవాలి. మీకు గురువులు నేర్పిన పాఠం కూడా ఇదే "ఎదుటి వాళ్ళలో మంచిని చూసి నేర్చుకో, చెడు ఉంటే వదిలేయి, దాన్ని విమర్శించకు" ఎదుటి వాడిలో చెడు గుణం ఉంటే అది అతనికే కర్మ అవుతుంది, మీరు అతని మంచిని చూసి ఒక పాఠం నేర్చుకోండి, ఆ మంచి గుణాన్ని మీలో పెంచుకోండి,అప్పుడు మీరు ఎదుగుతారు. అందుకే ప్రతి దాంట్లోని మంచిని చూసి నేర్చుకోవాలి.

ఇందుకు ఒక చక్కని ఉదాహరణ తుమ్మెద. తుమ్మెద పువ్వు దగ్గరకు వెళ్ళినప్పుడు పువ్వు అందాన్ని పాడుచేయకుండా, దాని సుగంధాన్ని, మకరందాన్ని మాత్రమే తీసుకుంటూ వెళ్ళిపోతుంది. అది పువ్వు నుంచి ఎంత మకరందం తీసుకున్నా, పువ్వును నాశనం చేయదు, మీరు కూడా తుమ్మెద లాగే ఉండాలి. ఎదుటి వాళ్ళలో మంచి ఉంటే దాన్ని గ్రహించాలి, వారి దగ్గర ఉన్న మంచి గుణాలను నేర్చుకోవాలి. కానీ వారి చెడు గుణాలను వెతికి పట్టుకుని విమర్శించకూడదు,మీరు విమర్శించినప్పుడు ఆ విమర్శ మీ మనసును కూడా కలుషితం చేస్తుంది.

అందుకే పత్రీజీ మనకు "నో కామెంట్, నో జడ్జ్‌మెంట్" అని నేర్పించారు. ఎదుటివారిని విమర్శించి మీ మనసులో పాపాన్ని పోగు

చేసుకోవద్దు, మంచి ఉంటే నేర్చుకోండి, చెడు ఉంటే వదిలేయండి.

తుమ్మెద పువ్వును నాశనం చేయకుండా సుగంధాన్ని, మకరందాన్ని తీసుకుని తేనెగా మార్చినట్లే, మీరు కూడా ఎదుటి వారిలో ఉన్న మంచిని మాత్రమే గ్రహించి, మీ జీవితంలో దాన్ని మంచి గుణంగా పెంచుకోవాలి. వారి చెడు గుణాలను విమర్శించకుండా వదిలేయాలి.

అప్పుడు మీలో అసూయ తగ్గి, గర్వం పోతుంది, అహంకారం తగ్గుతుంది,మీ మనసు శుద్ధి అవుతుంది, ఇతరుల ఎదుగుదలను చూసి సంతోషించగలుగుతారు.

5) భగవంతుడిని నమ్మినవారి దగ్గరే జ్ఞానం ఉంటుంది:

ఈ విషయాన్ని మీరు ఒకసారి గమనిస్తే మీకు చాలా స్పష్టంగా అర్థమవుతుంది. మీరు ప్రాపంచిక జీవితంలో ఉంటారు, అలాగే ఆధ్యాత్మిక జీవితంలో ఉంటారు. మీరు కేవలం ప్రాపంచిక జీవితంలో ఉన్నప్పుడు ఆత్మజ్ఞానం అంటే ఏమిటి? అనే విషయాలు తెలియదు.

కానీ మీరు ఆత్మ వైపు తిరిగి, ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చినప్పుడు మీ ఆలోచనలో మార్పు మొదలవుతుంది. “భగవంతుడు ఉన్నాడు, ఈ సృష్టి అంతా ఆయన చైతన్యంతోనే నడుస్తోంది, సృష్టి అంతా తానే అయి ఉన్నాడు” అనే విశ్వాసం మీలో కలుగుతుంది, ఆ విశ్వాసం నుంచే జ్ఞానం వస్తుంది.

“భగవంతుడు ఉన్నాడో, లేడో మాకు తెలియదు” అని అనుకునేవారికి ఇంకా జ్ఞానం పూర్తిగా వికసించలేదని అనుకోవాలి. “భగవంతుడు లేడు” అని ఖచ్చితంగా చెప్పేవాడు అసలు ఆధ్యాత్మిక సత్యాన్ని తెలుసుకునే ప్రయత్నమే చేయడం లేదు. “ఉన్నాడో, లేడో తెలియదు” అనే వాడు అజ్ఞాన స్థితిలో ఉన్నాడు. ‘‘భగవంతుడు ఉన్నాడు’’ అని విశ్వసించి, ఆ సత్యాన్ని

తెలుసుకోవడానికి ప్రయత్నించేవాడు జ్ఞాన మార్గంలో అడుగుపెట్టినవాడు. అందుకే మీకు మీరు ఒకసారి ప్రశ్నించుకోవాలి "ఈ మూడు స్థితుల్లో నేను ఎక్కడ ఉన్నాను?" అని.

మన వేదాలు ఎంతో స్పష్టంగా చెబుతున్నాయి భగవంతుడు ఉన్నాడు, అంతేకాదు, ఆ పరబ్రహ్మ తత్వం మీలో కూడా ఉందిఅని. అందుకే వేద వాక్యాలు "అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, సర్వం ఖల్విదం బ్రహ్మ" అని బోధిస్తున్నాయి.

"అహం బ్రహ్మాస్మి" నేను బ్రహ్మ స్వరూపుడిని.

"తత్త్వమసి" నీవు ఆ పరమ సత్యమే.

"సర్వం ఖల్విదం బ్రహ్మ" ఈ సృష్టి అంతా బ్రహ్మమే.

వేదాలు ఈ సత్యాన్ని చెబుతున్నప్పుడు, మీలో వాటిపై అనుమానం కాకుండా, వాటిని తెలుసుకోవాలనే తపన ఉండాలి. సృష్టి అంతా ఆ పరబ్రహ్మ యొక్క శక్తితో, చైతన్యంతోనే నడుస్తోంది అని మీరు నమ్మారు కాబట్టే, ఈ జ్ఞానాన్ని కొంతైనా తెలుసుకునే అవకాశం మీకు వచ్చింది. మీకు మంచి, చెడు రెండూ తెలుసు. దైవం ఉన్నాడని నమ్మి విగ్రహం చుట్టూ తిరిగారు, పూజలు చేశారు. కానీ ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చిన తరువాత, "దైవం విగ్రహంలో మాత్రమే లేదు, అంతటా ఉన్నాడు, సర్వ జీవులలో ఉన్నాడు, సృష్టి అంతటా సర్వత్రా ఉన్నాడు" అనే విషయాన్ని గురువు దగ్గర నేర్చుకున్నారు.

ఈ సత్యాన్ని నిజంగా తెలుసుకోవాలంటే, దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యానం ఎంతో ముఖ్యమైనది. ధ్యానం ద్వారా మీ దృష్టి బయట ప్రపంచం నుంచి లోపలికి తిరుగుతుంది. అప్పుడు క్రమంగా మీలోని ఆత్మ తత్వాన్ని తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

"నేను ఆత్మను కానీ, నేను శరీరాన్ని కాదు" అనే జ్ఞానం కలుగుతుంది. ఆత్మ ఈ శరీరం అనే ఒక తొడుగును ధరించి భూమి పైకి వస్తుంది. ఒక్కో జన్మలో ఒక్కో శరీరాన్ని ధరించి, తన అనుభవాల ద్వారా జ్ఞానాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతుంది. శరీరాలు మారుతూ ఉంటాయి. కానీ ఆత్మకు మార్పు లేదు అని తెలుసుకోవాలి.

అందుకే "ఆత్మనే నేను. నేను శరీరం కాదు" అనే జ్ఞానం ఎవరికి వస్తుంది? భగవంతుని తెలుసుకోవాలనే తపన ఉన్నవారికే వస్తుంది. భగవంతుని సత్యాన్ని తెలుసుకోకుండా, కేవలం శరీరమే నేను అని భావించే వ్యక్తి అజ్ఞానంలోనే ఉంటాడు. భగవంతుని తత్వాన్ని, ఆత్మ తత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్న వాడే నిజమైన జ్ఞాని.

అందుకే మహాత్ములు, సద్గురువులు ఈ విషయాలన్నింటినీ మనకు చెబుతూ ఉంటారు. ఏది తెలుసుకోవాలి? ఏది వదులుకోవాలి? మీలో ఏ గుణాలు ఉన్నాయి? ఏ గుణాలను పెంచుకోవాలి? ఏ గుణాలను తగ్గించుకోవాలి? అనే విషయాలను మీకు మీరు విచారణ చేసుకుంటూ ముందుకు సాగాలి.

అందుకే ప్రతి విషయాన్ని తెలుసుకోవాలి. రోజుకో కొత్త విషయం తెలుసుకుంటున్నప్పుడు, "ఇది నా గొప్పతనం" అని అనుకోవాల్సిన అవసరం లేదు. మీరు ఈ మార్గంలోకి రావడం, ఈ విషయాలను తెలుసుకునే అవకాశం రావడం కూడా భగవంతుని అనుగ్రహంగానే భావించాలి.

భగవంతుడు మీకు "ఈరోజు ఈ పాఠం నేర్చుకోవాలి" అని నిర్ణయించినప్పుడే ఆ పాఠం మీ ముందుకు వస్తుంది. అందుకే మన పెద్దలు "శివుడాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు" అని అంటారు. మీరు ఏ రోజున ఏ

పాఠం నేర్చుకోవాలి, ఏ రోజున ఏ స్థాయికి ఎదగాలి, ఈ ధ్యాన మార్గంలో ఏ అనుభవం పొందాలి ఇవన్నీ కూడా ఒక క్రమంలోనే జరుగుతూ ఉంటాయి. మీరు ఈ మార్గంలోకి వచ్చిన తరువాత గురువు చూపిన మార్గంలో, భగవంతుని మీద విశ్వాసంతో ముందుకు సాగాలి.

అందుకే భగవంతుడిని నమ్మినవాడు ఎప్పటికీ చెడిపోడు అని అంటారు. ఎందుకంటే విశ్వాసంతో పాటు సాధన, విచారణ, ఆచరణ ఉంటే మనిషి క్రమంగా ఉన్నత స్థితికి ఎదుగుతాడు. మరి గురువులు మనకు ఈ విధంగా ఒక్కొక్క గుణాన్ని ఎందుకు చెబుతారు? మీలో ఏ గుణాలు ఉన్నాయో మీరు గుర్తించుకోవడానికి. ఏవి ఉండాలో వాటిని పెంచుకోవడానికి, ఏవి అక్కర్లేదో వాటిని వదులుకోవడానికి.

మీరు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలంటే ఇలాంటి సూక్ష్మాతిసూక్ష్మమైన విషయాలను కూడా తెలుసుకోవాలి. కొన్ని విషయాలు విన్నప్పుడు మీకు తెలుసు అనిపిస్తాయి. కానీ కొంతకాలం తరువాత అవి మీ మస్తిష్కం నుంచి జారిపోతాయి. అందుకే వాటిని మళ్ళీ మళ్ళీ తెలుసుకోవాలి, మననం చేసుకోవాలి, ఆచరణలో పెట్టుకోవాలి.

అందుకే ఈ మార్గంలో నిరంతరం నేర్చుకుంటూ, మీలో మీరు విచారణ చేసుకుంటూ, మంచి గుణాలను పెంచుకుంటూ, అవసరం లేని గుణాలను వదులుకుంటూ, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడమే నిజమైన ఆధ్యాత్మిక ప్రగతి.

తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

పిరమిడ్ మాస్టర్ల 18 ఆదర్శ సూత్రాలు

1. సరియైన ధ్యానం అంటే "ఆనాపానసతి" ధ్యానం చేయడం, అందరి చేతా చేయించడం.
2. సరియైన ఆధ్యాత్మిక పుస్తకాలను చదవడం; వాటినే అందరి చేతా చదివించడం.
3. ధ్యానానుభవాలనూ, పుస్తక జ్ఞానాన్నీ విధిగా అందరూ పరస్పరం పంచుకోవడం.
4. విధిగా పౌర్ణిమ ధ్యానం చేయడం ; అందరిచేతా పౌర్ణమి ధ్యానాన్ని చేయించడం.
5. వీలయినంత మౌనం పాటించడం.
6. వీలయినప్పుడల్లా పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవడం.
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి.
8. మాంసాహారం ససేమిరా తినకపోవడం! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమిత ఆహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్నప్పటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ ఇవ్వడం.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణలో 'డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాలు' అన్నది ఏ మాత్రం లేకపోవడం.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ సత్యఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. ఎవరి సమస్యలను వారే, తమ తమ స్వీయ ఆత్మశక్తిని ఉపయోగించి పరిష్కరించుకోవడం.
16. గృహస్థులుగా వుంటూనే, ఎవరి పనులు వారు చూసుకుంటూనే, జీవన్ముక్తిని సాధించడం.
17. అన్ని గ్రామాల లోనూ, అన్ని పట్టణాలలోనూ విధిగా పిరమిడ్ ధ్యానకేంద్రాలు నెలకొల్పడం.
18. పిరమిడ్ మాస్టర్లందరూ తమ తమ ధ్యానానుభవాలను గ్రంథరూపం చేసి విధిగా ప్రచురించాలి.

తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.

ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1)	జీవితశాస్త్రం (మొదటి భాగం)	- రూ.130/-
2)	జీవితశాస్త్రం (రెండవ భాగం)	- రూ.130/-
3)	జీవిత సత్యాలు	- రూ.130/-
4)	సత్యమార్గం	- రూ.160/-
5)	ధ్యాన శక్తి	- రూ.130/-
6)	ధ్యాన శాస్త్రం	- రూ.130/-
7)	ఆత్మ శాస్త్రం	- రూ.120/-
8)	మరణించక ముందే మరణించాలి	- రూ.130/-
9)	భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం	- రూ.120/-
10)	"గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు?	- రూ.120/-
11)	గీతాసందేశం	- రూ.120/-
12)	ఉపమాన ధ్యాన సందేశాలు	-రూ.110/-
13)	జీవిత సూక్ష్మాలు	- రూ.100/-
14)	భగవంతుడంటే	- రూ.100/-
15)	తెలుసుకోండి	- రూ.100/-
16)	మెహర్‌బాబా సందేశాలు	- రూ.100/-
17)	మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు	- రూ.100/-
18)	పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం?	- రూ.100/-
19)	కోరికల వల్ల నష్టాలు	- రూ.100/-
20)	శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు	- రూ.100
21)	కఠోపనిషత్తు	- రూ.90/-
22)	ఉపమాన జ్ఞాన సందేశాలు	-రూ.90/-
23)	ముఖ్యమైన సందేశాలు-1	-రూ.80/-
24)	ముఖ్యమైన సందేశాలు-2	-రూ.90/-
25)	కర్మ సిద్ధాంతం	- రూ.80/-
26)	ధ్యానమంటే ?	- రూ.80/-
27)	త్రివిధాలు	- రూ.80/-
28)	ఉత్తమ పురుషుడు	- రూ.80/-
29)	వశిష్ఠుల వారి సందేశాలు	- రూ.70/-
30)	శాస్త్రాల అర్థం- అంతరార్థం	- రూ.70/-
31)	ఆత్మజ్ఞానం ఎందుకు?	- రూ.70/-
32)	జ్ఞాన జ్యోతి	- రూ.70/-
33)	జ్ఞాన కుసుమాలు	- రూ.70/-
34)	మరణం తర్వాత కూడా వచ్చేవి	- రూ.70/-
35)	షిరిడీ సాయి సందేశాలు	- రూ.70/-
36)	విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య	- రూ.70/-
37)	బుద్ధుని సందేశాలు	- రూ.70/-
38)	భూతదయే దైవత్వం	- రూ.70/-
39)	ఆత్మహంతకులంటే ఎవరు?	- రూ.70/-
40)	స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి	- రూ.70/-
41)	ధర్మ సూక్ష్మాలు	- రూ.70/-
42)	ఆశ్చర్యకరమైన విషయాలు	-రూ.70/-
43)	మానవునిలోని చెడు	-రూ.70/-
44)	మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు	-రూ.70/-
45)	చివటం అమ్మవారి సందేశాలు	- రూ.70/-
46)	మోక్షం అంటే?	- రూ.70/-
47)	కబీరు సందేశాలు-1	-రూ.70/-
48)	మనసు-1	- రూ.70/-
49)	మనసు-2	- రూ.70/-
50)	" అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? "	రూ.70/-
51)	ధ్యాన శక్తి కోల్పోకూడదంటే	- రూ.70/-
52)	మరణానంతరం జరిగేది-1	- రూ.60/-
53)	మరణానంతరం జరిగేది-2	- రూ.70/-
54)	మరణానంతరం జరిగేది-3	- రూ.60/-
55)	కబీరు సందేశాలు-2	- రూ.60/-
56)	దుఃఖ నివారణామార్గం	- రూ.60/-
57)	బ్రహ్మజ్ఞానం	- రూ.60/-
58)	ధ్యానం (పత్రీజీ)	- రూ.60/-
59)	ధ్యానం వల్లనే జ్ఞానం	- రూ.60/-
60)	అతీంద్రియ శక్తులు	- రూ.60/-
61)	ఆలోచించండి	- రూ.60/-
62)	నిర్వాణ మార్గం	- రూ.60/-
63)	ధ్యానులకు సూచనలు	- రూ.60/-
64)	యోగీశ్వరుల సందేశాలు	- రూ.60/-
65)	మమకారం	- రూ.60/-
66)	మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1	- రూ.60/-
67)	మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2	- రూ.50/-
68)	మాస్టర్‌గా ఎదగాలంటే?	- రూ.50/-
69)	భగవంతుని ఇష్టులవ్వాలంటే	- రూ.50/-
70)	సంకల్పమంటే?	- రూ.50/-
71)	ఈ జీవితం ఎందుకు?	- రూ.50/-
72)	ఆశ్చర్యం... ఆశ్చర్యం	- రూ.50/-
73)	మూడురకాల భవిష్యత్తులు	- రూ.50/-
74)	అరిహంత్	- రూ.50/-
75)	బుద్ధి వికసించిన వారి ప్రవర్తన	- రూ.50/-
76)	భార్యభర్తలు గొడవ పడకూడదంటే	- రూ.40/-
77)	విదురుని సందేశాలు	- రూ.40/-
78)	మూడురకాల జీవితాలు	- రూ.40/-
79)	ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే	- రూ.40/-
80)	ఛాంపియన్ అవ్వాలంటే?	- రూ.40/-
81)	బ్రహ్మం అంటే?	- రూ.40/-
82)	శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం	- రూ.40/-
83)	శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం	- రూ.40/-
84)	మహాత్ముల సందేశాలు	- రూ.40/-
85)	సత్యం	- రూ.40/-
86)	చక్రాలు	- రూ.40/-
87)	గురువును గుర్తించడం ఎలా?	- రూ.40/-
88)	భాగవత సన్నివేశాల అంతరార్థం	- రూ.40/-
89)	మౌన ధ్యానం	- రూ.40/-
90)	మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా?	- రూ.20/-
91)	శాకాహారమే మానవాహారం	- రూ.15/-
92)	అహింస మరియు శాఖాహారం	- రూ.15/-

సద్గురువు ద్వారా దుఃఖాన్ని నివారించే మార్గం సాధన అని తెలుసుకుని సాధన మార్గంలో అడుగుపెట్టిన వెంటనే అన్నీ సులభంగా జరిగిపోవు, ఆ సాధనలో అడుగడుగునా మానవుడికి ఎన్నో పరీక్షలు ఎదురవుతూనే ఉంటాయి.

1) ప్రపంచమే శాశ్వతం అనుకోవడం, 2) శరీరమే నేను అనుకోవడం, 3) ధర్మాన్ని ఆచరించకుండా చేసేది కూడా ఈ మాయే, 4)సత్యాన్ని తెలుసుకోకుండా చేసేది కూడా మాయే, 5) దైవంతో, గురువుతో అనుసంధానం ఏర్పడదు, 6) భగవంతుడు, జీవుడు ఇద్దరూ ఆత్మ స్వరూపులే అయినప్పటికీ భగవంతుడు మాయకు అధీనుడు కాదు, 7) దైవం పట్ల కంటే ప్రపంచం పట్ల ఆకర్షణ పెరిగితే, మీరు మాయకు వశమైనట్టే.

ఈ పరీక్షలు ప్రకృతి కల్పించిన మాయే! ఆ మాయను దాటడానికి ధ్యానసాధనే ఏకైక మార్గం, ధ్యానం ద్వారా మాత్రమే మాయను తొలగించుకుని పరమాత్మను చేరుకోగలడు.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.60/-

తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు

వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు

ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.

Telugu Books	English Books	Hindi Books	Kannada Books	Tamil Books